కనకాంబ, కాంచనపల్లి

గౌతమబుద్ధచరిత్రము

చెన్నపురి, 1918

Record no. 737

Kanakāmba, Kāñcanapalli

Gautamabuddacaritramu

Cennapuri, 1918

Record no. 737

కనకాంబ, కాంచనపల్లి
గౌతమబుద్ధచరిత్రము / కంచనపల్లి కనకమ్మగారిచే విరచితము. - చెన్నపురి: కంచనపల్లి కనకమ్మ, 1918.
7, 84 p. ; 18 cm.
Record no. 737

Kanakāmba, Kāñcanapalli
Gautamabuddacaritramu / Kañcanapalli Kanakammagāricē viracitamu. - Cennapuri: Kañcanapalli Kanakamma, 1918.
7, 84 p. ; 18 cm.
Record no. 737

737

గౌతమబుద్ధుని చరిత్రము

S.NO: 59 - చరిత్ర

AC.NO: 3746

గౌతమబుద్ధచరిత్రము

ఇయ్యది

కంచనపల్లి - కనకమ్మగారిచే

విరచితము

చెన్నపురి : ఆంధ్రపత్రికాలయమున ముద్రితము

౧౯౧౮

 [వెల 0-8-0 (ఎనిమిదణాలు)

Printed at the Andhra Patrika Press
No. 7, Thumbu Chetty Street
G. T., Madras.

విజ్ఞాపనము

సోదర సోదరీ తిలకములారా!

శతావధానులగు బ్రహ్మశ్రీ తిరుపతి వేంకటకవులు రచియించిన బుద్ధచరిత్రమును గొన్ని సంవత్సరములకుఁ బూర్వము చదివితిని. అది ప్రబంధము. మహాత్ములలో నగ్రగణ్యుఁడగు నా బుద్ధునిచరిత్రము వచనరూపముగ రచియించిన పాఠశాలలోఁ జదువు బాలురకును బాలికలకును సుబోధకముగ నుండునని తలంచి వారి గ్రంథము ననుసరించి యీ చిన్నిపొత్తమును వ్రాసితిని.

ఈ నా చిన్నిపుస్తకమునకు ఆంధ్రవిజ్ఞానసర్వస్వమునకు విజ్ఞానచంద్రికాగ్రంథమాలకును ముఖ్యసంపాదకులును, సంస్కృతాంధ్ర మరాటీ మున్నగు భాషావిశారదులు నగు శ్రీయుత కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు పంతులు ఎం. ఏ., గారు పీఠికనువ్రాసి, నాయందు వారికిఁ గల వాత్సల్యమును వెల్లడించినందులకు కృతజ్ఞతాపూర్వకవందనము లర్పించుచున్నాను.

గ్రంథ ముద్రణమందును, విక్రయమందును మఱి యితరవిధములను నా కెక్కువగా సాయముఁ జేయుచున్న యుదారస్వభావులు పరోపకారులును ఆంధ్రపత్రికాధిపతులు నగు శ్రీయుత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారికి నే నెంతయుఁ గృతజ్ఞనై వందనము లర్పించుటకన్న నేమి చేయఁగలను ? నా ప్రస్తుతస్థితియం దిట్టివారి సాయము, ప్రోత్సాహము లేకున్న నా యీ గ్రంథము వెలువడి యుండ దనియె చెప్పఁగలను. విద్యార్థినిదశయం దుండుటచేతను పండితులకుఁ జూపి సంస్కరించుటకు వీలులేక యట్లేముద్రణ కంపినందునను నీ పుస్తకమునం దెన్నియేని దోషము లుండ నోపును. ఆంధ్రుల యాదరము బడసి పునర్ముద్రణమున కవ సర మేర్పడు భాగ్యము లభించునేని యీ లోపములను తప్పక సవరించుకొందు నని విన్నవించుచున్నాను. సజ్జనులు గుణమునే గ్రహించి దోషముల మన్నింతురుగాక.

చెన్నపురి
౧-౯-౧౮.

ఇట్లు విన్నవించు సోదరి
కంచనవల్లి - కనకమ్మ.

పీఠిక

వైరాగ్యచక్రవర్తి యనియు భూతదయయొక్క యపరావతార మనియు విఖ్యాతిచెందిన బుద్ధదేవుని పవిత్ర చరిత్రము సకలదేశములందును సకలకాలములందును సజ్జనులకు నానందము కలుగఁజేయు ననుటకు సందేహము లేదు. బౌద్ధమతము నేఁడు హిందూదేశమునందు లేకపోయినను, అది యీదేశమునందే పుట్టి యీ దేశమునందు వేయి సంవత్సరములవఱకు వ్యాపించి యుండి సంస్కృతప్రాకృతములందు నసంఖ్యాతత్త్వదర్శనశాస్త్రగ్రంథములఁ బుట్టించి హిందూదేశజుల యాచారవిచారములకు నూతనమార్గముఁ గల్పించి తన నూతనతత్త్వబోధచేఁ బ్రపంచ మంతటను నవీనాధ్యాత్మప్రభాతరంగములఁ బ్రసరింపఁజేసి భూతదయయుఁ బరోపకారంబును అనునవియే పరమధర్మము లని లోకమున కంతకును జాటించి, క్రైస్తవ మహమ్మదీయాది మతోత్పత్తిబీజరూపమై యిప్పటికిని జనసంఖ్యయందు భూలోకమందు నన్నిమతములలోను ప్రథమగణ్యముగ నున్నది.

అట్టి యశోభూషితమైన ధర్మమతమునకు జనకుఁడైన బుద్ధదేవుని చారిత్రము మిక్కిలి పవిత్రమును శ్రావ్యమును అని చెప్పుటకు సందేహము లేదు. మన వసిష్ఠవామదేవాది ఋషిపుంగవులవలెనే యీ గౌతమముని పూజార్హుఁ డనుటకు సందేహము లేదు. బుద్ధునియొక్క యద్వితీయమగు నాధ్యాత్మ దివ్యప్రభనుబట్టియే మన పూర్వు లాతనిని విష్ణువుయొక్క దశావతారంబులలో నొక్క యవతారంబుగ భావించి యిప్పటికిని బుద్ధగయలోనున్న బుద్ధవిగ్రహమును బూజించుచున్నారు.

మతద్వేషముతోఁ గొందఱు హిందువులు బౌద్ధులను గుఱించివ్రాసిన విపరీతవాక్యములను మాత్రము చదివి, బౌద్ధ గ్రంథములను జూడకయే మనవారు కొందఱు జైనబౌద్ధులనిన తోడనే వారు నాస్తికులనియు అనీతిని బోధించువారనియు బుద్ధుని చరిత్రముగాని బౌద్ధగ్రంథములుగాని చదువుట పాప మనియుఁ దలంచెదరు. కాని యట్టియూహలు సరియైనవికావ నియు శ్రీ శంకరాదుల చరిత్రలవలెనే బుద్ధునిచరిత్రయుఁ బఠ నీయమును శ్రవణీయమును అగునని శ్రీమతి కంచనపల్లి కన కమ్మగారిచే వ్రాయఁబడిన యీ బుద్ధచరిత్రమువలనఁ దేట పడఁగలదు. ఈ గ్రంథము వ్రాయుటలో గ్రంథకర్త్రిగారు

శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవుల యాంధ్రీకరణమునం దున్నట్టు అశ్వఘోషరచితమైన బుద్ధచరిత్రయను సంస్కృతకావ్యమును అనుసరించిరి. బుద్ధచరిత్రమునకు నశ్వఘోషుని కావ్య మొక ప్రామాణిక సాధనముగ నెంచఁబడును. ఈ బౌద్ధకవి క్రీ. శ ౧-వ శతాబ్దమువాఁడని యందురు.

ఈ గ్రంథముయొక్క శైలి మిగుల సులభముగను, బాల బాలికలకు విశేషశ్రమలేకయే తెలియునట్టిదిగను, మృదు మధురముగను ఉండుటచే నిది బాలురకును స్త్రీ జనంబునకును అత్యంతోపయుక్త మనుటకు సందేహము లేదు. ఆంధ్రావలి యీ గ్రంథము నాదరించి, యెన్నియో ప్రాపంచికకష్టముల కోర్చి యున్నత విద్యనభ్యసించుచుఁ దానేర్చినవిద్య నితరు లకు గ్రంథరూపమున బోధించుచున్న యీ గ్రంథకర్త్రికి నిట్టి గ్రంథములనేకములు రచించుటకుఁ బ్రోత్సాహము కలి గించు నని నమ్ముచున్నాను.

౧-౯-౨౫. } కే. వి. లక్ష్మణరావు.

గౌతమబుద్ధచరిత్రము

———:o:———

ప్రథమాధ్యాయము

శ్రీరామచంద్ర సార్వభౌముని రాజ్యస్థానమైన కోసల దేశమునకు నీశాన్యదిక్కున రోహిణీనదీతీరంబున కపిలవస్తు' అనుపేర నొకనగర ముండెను. ఈ నగరము హిమాలయప్రాంతమందు శాక్యవంశపు రాజులకు రాజధాని యై, కాశీనగరమునకు నుత్తరంబున నూఱుమైళ్ల దూరంబునఁ బఱఁగుచుండెను. ప్రస్తుతము సంయుక్తరాష్ట్రములలో (United Provinces cf Agra and Oudh) 'బస్తీ' అను జిల్లాలో ఈశాన్యముగ నుండు 'పిప్రహావా' యను పల్లె యున్న స్థలముననే కపిలవస్తునగర ముండెనని కొందఱు శోధకులచే తీర్మానింపఁబడియె.

శాక్యవంశపు రాజులలోఁ బ్రఖ్యాతపురుషుఁ డగు శుద్ధోదనుండు కపిలవస్తునగరము నేలుచుండెను. ఇతఁడు మహాపరాక్రమవంతుఁడు, ధీమంతుఁడు, దిగంతవిశ్రాంత కీర్తిమంతుఁడు. అనేక సామంతరాజులచేఁ గప్పములఁ గైకొనుచుండిన యీ చక్రవర్తి కష్టసుఖముల గుర్తెఱింగినవాఁడై

తన ప్రజల కత్యంతమైన సౌఖ్యము సంపద గలుగునటులు రాజ్యపరిపాలన మొనరించుచుండెను. సన్మార్గధనుం డైన యీ శుద్ధోదనుండు క్రీస్తుపుట్టుటకుఁ బూర్వ మైదవశతాబ్దమందు వర్ధిల్లుచుండెను. మహారాజు సుప్రబుద్ధునిపుత్త్రిక లగు మాయాదేవియు గౌతమియు నను నిరువురు పడఁతులను బెండ్లియాడి యా నృపాలుండు సుఖంబుండెను. వీ రిరువురు భార్యలును పాతివ్రత్యమునకు, దైవభక్తికి, గురుజనాసక్తికి, ధర్మానురక్తికిఁ బ్రఖ్యాతిఁగాంచిరి. మాయాదేవి ప్రజలకుఁ దల్లివలెను, చుట్టాలకుఁ బట్టుగొమ్మభంగిని, భర్తకుఁ బంచప్రాణములుగను సంచరించుచుండెను. ఈ సతీరత్న మొకరాత్రియం దొక చిత్రమైన స్వప్నముం గాంచెను. ఇఁక నరజామునకుఁ దెల్లవారు నను సమయమందు నక్షత్రమండలమునుండి యారుకిరణములు గల యొక నక్షత్రము కుడిప్రక్కఁ దాఁకి తనగర్భమునఁ జొచ్చినట్టు లా లలనాలలామ కలఁ గనెను. గుండెలు ఝల్లుమనంగ నల్లన మేల్కాని యుత్కాంత తనభర్త కక్కల తెఱం గెఱింగించిన నమ్మహారాజు శుభసూచకమ్మనుచు నానంద మొందెను. క్రమక్రమముగా నీ స్వప్నక్రమము ప్రజల కందఱకు విదితంబయ్యెను. స్వప్నఫల ప్రదర్శకులును జ్యోతిశ్శాస్త్రపండితులును జగద్విఖ్యాత పుత్త్రరత్నం బా చక్రవర్తికిఁ గలుగుననియు నా రాకొమరుఁడు విశ్వం బంతయు శాసింపఁగలిగిన సార్వభౌమపదవిం

బొందుననియుఁ గాదేని 'విద్యాపూర్ణుండై పరతత్త్వవిశారదుండయి సర్వలోకులకు నిత్యానందంబుఁ గల్పింపఁగలవాఁడు' అగుననియు మహారాజున కెఱింగింప నతండు నపరిమితానందముం జెందెను. ఆ సమయమునందే (తుషితపురించ్యవిత్వా బోధిసత్త్వ మహాత్మా! నృపతి తవసుతత్వం మాయాకుక్షోపపన్నః) "ఓ రాజా! మహాత్ముఁ డగు బోధిసత్త్వుఁడు తుషితపురమును విడిచి నీకొమరుఁడై మాయాదేవి గర్భమును బ్రవేశించె" నని ఆకాశవాణి పలికెను. పదఁపడి ప్రజలెల్ల సమ్మదమంద మాయాదేవి గర్భమును ధరించెను. భగవంతుఁ డగు బోధిసత్త్వుండు తనగర్భమం దుంటం జేసి మాయాదేవి యధికశోభాసమేతయై యుండెను. రాజ్యమందు దారిద్ర్య మడుగంటునటులు ధనవృష్టిఁ గురిపించి యా నృపాలురాణి రాజ్యమున కెల్ల మోదదాయిని యయ్యె. పూర్ణగర్భవతియై పుట్టినింటికిఁ బ్రసవమునకై పోఁదలంచి పరిజనంబుతోఁ బురంబు వెడలి కొంతదూరంబు చనంగ నొక యుపవనంబు తటస్థంబయ్యె. ఫలములు, పుష్పములు, పల్లవములు, పిందెలు మొదలగువాని భారముచే నమ్రములైన తరువులతోను, వివిధ పరిమళ ప్రసూన వితాన సమేతంబులైన లతాద్రుమంబులతోను, పలాశాది ప్రశస్త శృంగార వృక్షములతోను రాజిల్లు లుంబినీవనంబు ఆ సతీతిలకంబు చేరువఱకుఁ గొంత ప్రసవవేదన కనంబడఁ గ్రక్కున

నాపె యానంబు నిలుపఁగఁ జేసి, దిగి, కొండొక దవ్వరిగి యొక్క పలాశ వృక్షశాఖ చేతులం బట్టుకొని ప్రసవ వేదనా పరవశయై యుండుసమయంబున నాపలాశ వృక్షంబు గొడుగువలెఁ బత్రవ్యాప్తిం గావించి యావధూటికి యెండతగుల కుండునటు లొనరించెను. అదేమిచిత్రమో గాని ఆమెనిల్చిన చోట మృదువైన పచ్చికయుఁ బుష్పాడియు సమీపమున నొక్కయేఱును గన్నుల కింపుగాఁ గలిగెను. కలియుగంబున 2478 వత్సరంబున వైశాఖశుద్ధ పౌర్ణమినాఁడు (557 B. C.) మబ్బువిడిచిన మార్తాండుని మాడ్కి బుద్ధుండు తనతల్లి గర్భమునుండి వెడలెను. అయర్భకునిమీఁద దేవతలు పారిజాతాది పుష్పవర్షముఁ గురిపించిరి. దిక్పాలకులందఱు నచ్చోటికేతెంచి దివ్యమైన బంగారుపాలకిలో నాసాధ్విని బసిబాలుని నునిచి కపిలవస్తు నగరమునకు నాకలాచిక నధిక ప్రీతితో మోసికొని పోయిరి. పౌరులును శుద్ధోదనుండును ఆనంద సముద్రంబున నోలలాడిరి. ఆచక్రవర్తిని మాయాదేవిని బరిపరివిధంబులఁ బ్రస్తుతింపనివార లెందును గానరాకుండిరి. సమస్తలక్షణ సముజ్జ్వలమైన పుత్రుచందముం గాంచి నిక్కముగ నక్కుమారుఁడు సమస్త మహీపాల శిరోవతంసం బనం దగు సార్వభౌముఁ డవునోనని మునువినిన పండితవాక్కుల స్మరించి రాజచంద్రుఁడు ప్రమోదాతిశయముం జెందెను. కాని సంసార నిమగ్నుఁడుగాక ప్రపంచమందలి సర్వసంస్కర్తలలోను విరాగులలోను మహానుభావులలోను అగ్రగణ్యుఁడై జ్ఞానులకు జ్ఞానబోధచేయు నాత్మసన్న్యాసి యగునని యెఱుఁగఁడయ్యెను! భావ్యర్థగతు లెఱుంగు టెంతవారికిని శక్యమగునా ?

చక్రవర్తికిఁ బుత్రుఁడు కలిగెనని విని సామంతరాజులందఱును యథోచితమైన కానుకలం దెచ్చి మహీపతి కిచ్చిరి. పట్టణమంతయుఁ బౌరు లలంకరించిరి. మంగళవాద్యములు నృత్తగీతములు ఎల్లెడల మెండయ్యెను. నాఁడు సంతసము వెల్లిగొనంగ జనులందఱును సౌఖ్య మగ్నులైరి. అందఱును రాజుకొమరునిఁ జూడఁ దరలివచ్చిరి. అట్టిసమయంబునఁ జిరకాలమునుండి పరమాత్మ ధ్యాననిష్ఠా గరిష్ఠుండైన సత్పురుషుండు - మహానుభావుం 'అసితుం'డను వృద్ధతాపసుండు - 'లోకోద్ధారణ దీక్షాబద్ధుండు మాయాదేవి గర్భంబున నుద్భవించె' నన్న గగనంబున నెక్కువార్తవిని జనితాపరిమిత కుతూహలుండై కపిలవస్తు నగరంబున కతిశీఘ్రంబుగఁ జనుదెంచి మహారాజు సౌధంబు ప్రవేశించెను. శుద్ధోదనుఁ డెదురుగా వచ్చి మ్రొక్కి అర్ఘ్యపాద్యాదులచే సత్కరించి చేతులు జోడించి తాఁ జేయందగు కార్యంబు సెలవియ్యుఁడని ప్రార్థింప నాఋషిపుంగవుండు 'నీకు జనియించిన బుద్ధదేవునిఁ జూడంగ వచ్చితి'నని వచియింపఁగ నాజనవల్లభుం డతనిని వెంటం గొంపోయి దయావిశాలుండైన తన ముద్దులబాలునిఁ జూపెను.

తాపసి యాపసిపాపనిం దనియఁ గాంచి కన్నీరు కాలువలు గట్ట ఱెప్పలార్చుచు వెనుకకుఁ దిరుగుటఁజూచి గుండెలు తటతటమని కొట్టుకొనంగ శరీరమంతయు భయకంపితముగాఁగ నా రాజచంద్రుఁడు దీనుఁడై, స్వరము కుత్తుక యందు హత్తుకొనఁగఁ దెప్పరిల్లుకొని 'కన్నీరునకుఁ గారణంబేమి' యని యమ్మహాత్ముని అనేక విధంబులఁ గాఁగల కార్యం బెఱిఁగింపుమని ప్రార్థించెను. భయముఁ జెందవలదని పలుకఁగ నామహామహుని పాదములకడ మాయాదేవి 'తన సుతుండు ఆయుర్యశో ధీమంతుండౌనని దీవింపు'మని యబ్బాలుని విడిచెను. ఆ మహనీయుండు బాలుని పాదములందు చక్రకమలాది చిహ్నములెల్లఁ జూచి తనశరీరమందుఁ బులకల్జనింపఁగ 'నితండనఘుండు, సర్వజనాభివంద్యుఁడు, ఇతనికెంత పెద్దవారలును అనమ్యు' లంచును వచించి దీవించి మాయాదేవినిం జూచి, 'ఎవ్వరును నీకు సరిరారు. నీభాగ్యమే భాగ్యము. నీకు భగవంతుఁడే పసిపాపఁడై జనించెను. ఎల్లలోకముల యజ్ఞానంబు ప్రోకార్ప నిట్టి యవతారంబులు గల్గుచుండును. నీకన్న నదృష్టవతు లేరును లేరని పల్కుటకు సంశయము కలుగుచున్నది. అయినను జన్మము దుఃఖావహమని గుర్తెఱింగిన నీబోంట్లకు మరణమన్న జంకేలగలుగును? ఇట్టిమహాత్ముఁడిఁగన్న పతివ్రతా శిరోమణివి నీకు నిర్వాణంబు కరతలామలకంబు గాదె? సుఖదుఃఖముల సంబంధంబు నీ కేటికి? నేఁటి

కేడవ దినంబున నీకు మోక్షంబు సంప్రాప్తించు'నని చెప్పి యయ్యోగి మరలెను. జననవృద్ధి లయములు దేహమునకుఁ గాని ఆత్మకుఁగావను నిరూఢజ్ఞానము కలిగిన మాయాదేవి దేహత్యాగమునకు సంసిద్ధురాలై యుండి యోగిచెప్పిన కాలమునకు సరిగా భూలోకమును వదలి స్వర్గముఁజెందెను. సత్యవాక్సంపన్నులైన సత్పురుషుల వచనమ్ము లవంధ్యములు గదా!

శుద్ధోదనుని యభిమతంబున గౌతమి ఆపసిబాలుని దనకన్నకుమారుంబలెఁ బాలిచ్చి పెంచుచుండెను. ఆశిశువునకుఁ బదియవ దినంబున నామకరణం బొనరించి సర్వార్థసిద్ధుండను నామంబిడిరి. కాలము గడచినకొలఁది రాజ్యమందఱికిని సర్వార్థ సంసిద్ధి కలుగుచుండుటంబట్టి ఆనామంబు సార్థకంబయ్యె. రాజ్యం బభ్యుదయోన్ముఖంబై వర్ధిల్లిన పగిది సర్వార్థసిద్ధుండును వృద్ధిం బొందుచుండెను.

శైశవము తీరినవెంటనే శుద్ధోదనుండు సర్వార్థ సిద్ధునికి విద్యాభ్యాస మొనరింపవలయునని కోరి ఆచార్యు నన్వేషింపసాగెను. మంత్రిమండలియు పండితమండలియు నేకగ్రీవముగ విశ్వామిత్రుఁడు తగిన దేశికుఁడని తెలియంజెప్పఁగ నాతని రాజు పిల్వంబంపి శుభముహూర్తంబున గొప్ప యుత్సవ మొనరించి ఆవిబుధవర్యుని మణివస్త్రాల నర్చించి యతనికి తనసుతు నొప్పగించెను. ప్రహ్లాదునిపగిది నబ్బాలకుండు విశేష శేముషీ ప్రభావముంజూపి, క్రొత్తవిషయముఁ

జెప్పి చెప్పకమునుపే పూర్వమందు దాని నెఱింగినవానివలె క్షణంబులోఁ దిరిగి పఠించుచుండెను. బుద్ధిసూక్ష్మత యధికముగ నుండె, ధీప్రచారము ప్రబలముగ నుండె, గ్రహణశక్తి విశేషముగనుండెను. అల్పకాలములోనె యీభాష యాభాష యని లేక యీ పుస్తకంబా పుస్తకంబని లేక సర్వము నొక్కసారిగ మ్రింగఁ గలిగియుండెను. తాఁ జెప్పినదానికన్న విశేషముగఁ దిరిగి చెప్పుటఁ గని సర్వార్థసిద్ధుండు మనుజమాత్రుండుఁ గాఁడని విశ్వామిత్రుండు దృఢంబుగనమ్మి అతనికి సాష్టాంగ నమస్కార మొనరించి 'నీవు నాకు శిష్యుఁడవు గావు, నిజమ్మైన నీకు నే శిష్యుఁడను. నే నెఱింగినదానికంటె నెక్కుడు నీ వెఱుంగుదువు. అనఘా! నీ మతి విశేషముముందర నా నేర్చిన దెంతయగును? నీవు గ్రహింపఁ దగినదెద్దియు నిఁక లేదు. సర్వవిద్యలును నీవు పుట్టకమునుపే నీ పొట్టలోఁ గలవు. గురువులకెల్ల గురువు కాఁగలిగినవాఁడవు. మహాత్ముఁడవు. నీవు సామాన్యుఁడవని నిన్ను మీతండ్రి తలంచెను గాఁబోలు.' అని ప్రస్తుతించి జరిగిన వృత్తాంతంబంతయు శుద్ధోదనునకు విశదీకరించి అతనిచే హేమాంబర మణిహారంబుల నుపాయనంబుగఁ గైకొని తనంతఁ దాఁ జనియె.

శుద్ధోదనుం డతి శూరుండగుటచే సర్వార్థసిద్ధునికి బల్లెముతోను, విల్లుతోను, ఖడ్గముతోను సాధనముచేయ నేర్పించెను. పదిసంవత్సరంబుల వయస్సునకే సర్వార్థ

సిద్ధుండు అశ్వశిక్షయందును, స్యందన విహారములందును, చాపవిద్యలందును, యుద్ధనైపుణ్యమందును, సకలకళలందును అఖండుఁడై గర్వ మొకింతయు లేక పరాక్రమవంతుఁడయ్యు కరుణాలవాలుండయి, ప్రతిభాప్రశస్తిం జెందెను. ఇతనిరూపము మనోహరము. ఇతని తేజము జగద్వంద్యంబు. ఇతని లావణ్య మమోఘము. ఇతని సౌందర్యము వర్ణనాతీతము. ఇతని మనంబు నిర్మలంబు. ఇతఁడు కృపాపరిపూర్ణుండు. ఈడుంజోడగు బాలురతో నప్పుడప్పుడు మృగయావిహారార్థము చనుచుండెను. కాని యమ్ములతోఁ గొట్టక, శూలములతోఁ బొడువక, బల్లెములతో బాధింపక, ఖడ్గములతో ఖండింపక, ఏపాటి గాసియుఁ బెట్టక, అధికోపాయంబున మృగంబులఁ బట్టుచుఁ జేఁ జిక్కినవానిం జంపక యా కృపైకగుణావలంబి విడుచుచుండెను. తా నెక్కినగుఱ్ఱ మతి త్వరితముగాఁ బరుగిడుటచే మిగుల డస్సెనని కనుఁగొను నపుడెల్ల నిలిపి యశ్వమునుదట్టి శ్రమ తీరున ట్లుపాయంబులొనరించి వ్యథ మాన్పుచుండును. దేవదత్తాదు లగు తన సుహృత్తులతో నొకనాఁడు మంచుమల చెంతకేగి ఉపవనాంతములందు విహార మొనర్చుచుండఁగ, నంబరవీథియందు హంసలబారు గన్పడంగ సర్వార్థసిద్ధుఁడు వాని స్వచ్ఛమయిన ధావళ్యము చంచువుల చిత్రము ప్రమోదము గొల్పఁ దన హితులకు హంసవృత్తంబులఁ బ్రశంసించుచున్న సమయం

బున, దేవదత్తుండు తన వింటియం దొక యంబును సంధించి యంచలపై విడువ, నొకహంసి యాకోల నేలంగూలినదై గిలగిలమని కొట్టుకొనుచు శోకభరంబున నఱచుచుండ తత్క్షణంబ సర్వార్థసిద్ధుండు దానింగైకొని అపారకరుణాకరుండు గావున, తనమొడిలో నిడుకొని, గ్రుచ్చుకొనియున్న యమ్మును నయమ్ముగఁ దీసివయిచి, అతి మృదువులయిన పక్షంబులఁ దన హస్తంబుచే నిమురుచు, వనౌషధీరసంబుల నా గాయం బుపశమింపం జేసెను. ఇట్లు వివిధోపచారంబులఁ జేయుచుండిన తఱి నా హంసమును హింసింప నేసిన దేవదత్తుని భృత్యుండు వచ్చి 'నా దొరయంచను నాచేతి కిమ్మని వినయమ్ముగా నా రాజసుతునిం బ్రార్థించెను. 'ఈ హంస చావలేదు. ప్రాణసమేతముగా నున్నది. కావున నిది దేవదత్తుని సొత్తు కాదు' అని రాకొమరుండు వక్కాణింప నతండు దానిం దనస్వామి కెఱింగింప దేవదత్తుండు చనుదెంచి తనచే దెబ్బం జెందిన హంసంబు తనదే యగునని వాదించి ఆ పక్షిని తన కిమ్మని అమ్మహీపాలతనయునితోఁ గలహింపం దొడంగఁగ నతండు వితండావాదంబుల కియ్యకొనక అను నయంపు పల్కులతో నయంబుగా 'నీవు దానిం జంపలేదు. కాన నయ్యది నీదికాదు, నేను జావనున్నదానిని బ్రతికించితిని. కాన నది నాయదియే' యని వచించి 'నీ విందులకు సమ్మతింప కుండిన మన మిరువురము విద్వాంసులు చెప్పు న్యాయ

మునకు బద్ధులము కాఁగలము' అని నుడువఁగ వా రిద్దఱును రాజసభ కరుగుదెంచి తమ సంశయముం దెలుపఁగ నందొక విద్వచ్ఛేఖరుండు లేచి యిట్లనియె.

"ప్రాణులకెల్ల ప్రాణంబు ముఖ్యంబు గాన రక్షణం బొనర్చినవానిదే తదాధిపత్యంబు కాని ప్రాణిహింస నిష్కరుణ గావించినవాని కెట్లు తదాధిపత్యంబు లభించు? అది ధర్మదూరంబు. ఇంతియకాక మృగయాధర్మంబున శరనిహతం బగు జంతువు ప్రాణమున్నంత దనుక ఘాతకునిది గాదను న్యాయంబు సర్వజనాదరణీయంబు గనుక సర్వార్థసిద్ధునదే యీ హంస". ఇట్లు నిష్పక్షపాతముగా నా విద్వాంసుండు వివరింపఁగా నందఱును ముదంబందిరి. అదిమొదలు ప్రాణహింసాచరణం బధర్మంబని యందఱకుం దేటదెల్లం బయ్యె. "అహింసా పరమో ధర్మః" అను నార్యోక్తి సర్వార్థసిద్ధుని ప్రథమోపదేశము. ఆ హంసకు వ్యథమాన్పి పూర్వదశం గలుగఁజేసి ఆకసంబున విడువఁగ నయ్య దతిసంరంభంబున రివ్వున నెగిరిపోయె. పదివత్సరంబుల బాలుం డయ్యును సర్వార్థసిద్ధుండు పరమధర్మం బగు నహింస ననుష్ఠించుచుండెను!

గౌతమబుద్ధచరిత్రము

ద్వితీయాధ్యాయము

తుల్యశీలవయస్కు లగు బాలురతోఁ గాలయాపనం బొనర్చుచు సర్వార్థసిద్ధుండు వృద్ధిఁ జెందుచుండఁగ, ఆజానుబాహువులు, విశాలవక్షస్థలంబు, పుండరీకనయనంబులు, విశాలఫాలంబు, గంభీరస్వరంబు, సింహబలంబు, ధైర్యస్థైర్యోత్సాహంబులు సర్వార్థసిద్ధుని జవ్వనంబుఁ బ్రకటీకరించెను. శుద్ధోదనుండు తన కుమారుఁడు పరమార్థవిచారమగ్నుండై ప్రవర్తించుటం గాంచి సంసారదూరుండగు నేమో యను భయంబున తనయుని మనంబు సంసారసక్తంబుగఁ జేయం దలంచి వసంతసమయంబున నొక్కనాఁడు తదృతువిశేషంబు లద్భుతావహంబులుగానఁ గొమరుని హిమనగప్రాంతంబుల కరిగి వీక్షింపుమని చెప్పి తన్మార్గంబు సర్వంబు పంగ్వంధవికలాంగబధిరరహితంబు గావింపించెను. సర్వార్థసిద్ధుండును హేమమయస్యందనం బొండెక్కి పురవీథిఁ గడచి చనుచున్న కాలంబున, అఱ్ఱునఁగాడి కట్టి ములుకొయ్యతోఁ బృష్ఠభాగంబునఁ బొడుచుచుండఁగ భూమిదున్నుచుఁ గష్టపడు

చుండు దున్నపోతులను, దున్నినపొలములో విత్తనంబులు జల్లుచుండెడు సేద్యగాండ్రను, పుష్పఫలభారంబున నేల నంటుచుండెడు తరుప్రకరంబును, ఫలాసక్తి నావృక్షములం జేరిన కలకంఠశారికానికరంబును, చీమలబారులను, ఆచీమలను మ్రింగెడు బల్లులను, వానింగబళించు సర్పములను, వానిం దిను గరుడపక్షులను, తటాకములందలి చేఁపలను, వానిం బట్టెడు పతంగంబులను, వానింజంపితిను శ్యేనంబులను జూచి బహుభంగుల సంతాపముచెంది హింసాప్రచారంబైన ప్రపంచంబున నిట్టిదుర్నయంబులం జూపనెంచి తనతండ్రి తన్నుఁ బంపెనోకోయని తలంచి కొండొకవడి విచారించి తత్సమీపమున నుండిన బదరీతరుచ్ఛాయలం గూర్చుండి యోగనిష్ఠం బొందెను. ప్రాణిసంరక్షణంబే ప్రధానముగ నెంచి జన్మించిన మహానుభావునకుఁ గరుణయే కాయంబయ్యె. అట్టి కృపాళుం డేకాగ్రమనస్కుండై ధ్యానంబు సల్పుచుండ నతనిం దన భృత్యులు లేపంగ నెంచిరి గాని 'వద్దు, లేపవద్దు, ఆతండే లేచును' అని ఆకాశంబున నొక పెద్దధ్వనిని విని భయోపేతులై యూరకయుండిరి. అతండును ధ్యానసమాప్తిగావించి లేచి యందఱితో నగరంబునకు మరలెను.

శుద్ధోదనుండు గడచిన వృత్తంబంతయు నెఱింగి కొమరునకు మూఁడు సౌధంబుల నిర్మించెను. చలికాలమున కొక మేడయు, వేసవికాలమున కొక హర్మ్యంబును, వర్షాకాల

మునకొక ప్రాసాదంబును సుఖాతిశయంబు సంఘటింప నెంచి కట్టించెను. ఇంతియకాక యా రాజభవనంబులకుఁ జుట్టును దోటలు, ఉద్యానవనములు, వార్యంత్రంబులు, కాల్వలు, కల్హారములు, దీర్ఘికలు, సౌరభాతిశయంబుగల ప్రసూన లతాగృహంబులు, మంచిగంధపు వృక్షములు, పొగడలు, మోదుగులు, మధూకంబులు, గోరంటలు, వివిధఫలవృక్షంబులు, కన్నుల కింపగు రంగులు గల పత్రపుష్ప సమేతములైన ద్రుమంబులు, వర్ణించుటకుఁ బరిగణించుటకు నలవికాని సర్వవస్తు సమేతంబులైన యా సౌధంబులకుఁ గ్రమముగా శుభ, సురమ, రామ, యను పేర్లుపెట్టి అందుఁ దనతనయు నివసింపఁ జేసెను. జలవిహారంబులకుఁ దగిన కాసారంబులును, తరణీ విహారమునకుఁ దగిన తటాకంబులును, అందుం గలవు. అన్నియును మేటిసౌఖ్యంబుఁ గూర్పఁగలవియై యొప్పెను. మనమును మరల్పఁజేయ నిఖిల వస్తునికరం బందు ఘటింపఁజేసినను, రాకొమరుని కష్టాదశాబ్దములు నిండి యౌవన మంకురించినను, విషయపరాఙ్ముఖుఁడై వర్తించుట తండ్రి కనుంగొని, విచారగ్రస్తుండై మంత్రులం బిల్వనంపి ఆత్మజుని సంసారసక్తునింజేయు నుపాయంబరయుఁడని కోరిన నందొకవృద్ధుండు

ఉ. "మాయలమాటలున్ వగలు మంచితనమ్ములు టక్కులున్ హొయ
ల్పాయక యిల్లు గట్టుకొని పాపముఁ బుణ్యమెఱుంగనీక నా
పాయమునై పతీమణుల బంటుగఁ బూరుషుఁ జేయఁగావునన్
జేయును నేల పుత్రునకుఁ బెండ్లియొనర్పుము సత్వరంబుగన్."

అని పలికెను. (దీని నిజంబు శోచనీయంబు!) మఱియొకండు లేచి "స్వామీ! 'తా వలచినది రంభ తా మునిఁగినది గంగ' అను లోకోక్తి వినమె. తల్లిదండ్రులు తరచి తరచి పరీక్షించి, కులము శీలము గోత్రము విచారించి, కన్యకం దెచ్చి తమ సుతులకుం బరిణయ మొనర్పఁగ వధూవరుల మనంబు లేకంబు గాక వేఱుతీరగుట మనకన్నులకు గోచరంబే కదా? అనుభవసిద్ధంబునుగద! కానఁ దమకుమారుం డే కాంతం గోరునో ఆ వనిత అతనిసతి కావలయును. సార్వభౌముని ముద్దులపట్టి యగుట సర్వార్థసిద్ధుని వరించు కన్యకలు లక్షోపలక్షలుండుదురు. శాక్యులపండుగునాఁడు బహుమానము లొసంగెద మను నెపంబునఁ బడుచుఁ గన్నెల రప్పింపం దగు. రాజాజ్ఞ నుల్లంఘించుటకు వీలులేదని గాని, ధనమం దాశగొని గాని, మహోత్సవముం జూడ నెంచి గాని, అద్భుతజన్ముం డగు భవత్సుతుని సందర్శింప నెంచి గాని పెక్కురు పడుచుఁగన్నెలు వత్తురు. అందొకదాని నీ కుమారుండు వరియించును. ఏరాజైనను తనసుతను నీసుతుని కీనెంచని మతిహీనుఁడా?" యని నుడువంగ, రారాజందుల కియ్యకొనియె. మంచి యుపాయంబు గుదిరెనని మదిని ముద మందుచుఁ దగిన సంవిధానం బంతయు నిర్ణయింప నా పండుగునాఁటి కనేక కన్యకలు బహుమతులం గైకొనుటకుఁ దరలివచ్చి కపిలవస్తుపురంబు నిండిరి. తన కిచ్చకు వచ్చిన

మచ్చికంటెని బహుమతు లిచ్చుచు వరియింపు మనియు, స్వయంవరంబున కిది ప్రయోగం బనియు తనయునికిఁ దెలియం జెప్పె. సంసారవిముఖుండై సన్న్యాసోన్ముఖుండై యుండు తన కుమారుం డోడ్కొనివచ్చుటకై యతని కా బాల్యసఖుం డగు విష్ణుశర్మను బనిచెను. అతండును 'ఇంతకన్న నేఁ జేయఁగల కార్య మెద్ది? చిన్ననాఁటంగోలె మాకున్న స్నేహంబునకు సర్వార్థసిద్ధుండు నా మాటల కొడంబడక యుండునే? హిత మార్గంబు గఱపుటయే మిత్రలక్షణంబుగదా' అని వేవేఁగ రాజసూనునికడకు వెళ్లి యుక్తియుక్తంబుగను సవినయంబుగను భూవల్లభుని యుల్లంబు తెఱంగెఱింగించి 'నీ వృద్ధ పితరుని మాట వృథసేయక వచ్చి పద్మేక్షణలకుఁ బసదనంబిచ్చి యక్కన్నియలలో నీ మనమున కెక్కినదాని నెక్కాతెం బెండ్లియాడు'మని యుగ్గడింప నతం డిట్లనియె:

"సంసారంబు కష్టబహుళంబు, యౌవనంబు జరాదూషితంబు, మృత్యు వనివార్యంబు, విషయమ్ములు శుష్కేంధనమ్ములు, మోహంబు దావాగ్ని, ప్రాపంచికంబు లన్నియు నస్థిరంబులు. కాన, నుద్వాహం బొల్లక స్థిరంబైన జ్ఞానమార్గం బవలంబనీయంబని యెన్నుచున్నాఁడను. నా కెందుకుఁ బరిణయంబు?" అంత విష్ణుశర్మయు "నీ వతిసుందరాకారుఁడవు, గుణాభిరాముఁడవు, సన్మార్గధనుండవు, సకలకళాపారంగతుఁడవు, కరుణాపారీణుఁడవు. నీకు విశేషముగఁ జెప్ప నవసరమే

లేదు. పరిణయంబు పరమార్థప్రాప్తికి సహకారంబు గాని విరోధంబు గానేరదు. ఆశ్రమంబు లన్నిఁటిలో గృహస్థాశ్రమం బతిశ్రేష్ఠం బని బుధులు వచించిరి కాదె? జనకాది మహర్షులు మహావేదాంతులైనను సంసారంబును వదలి వర్తించ లేదు. వార లివి అస్థిరంబులని యెఱుంగరా? భార్యా పరిగ్రహంబు మానిరే? వారి తపంబులు చెడెనే? ధర్మమార్గంబు తప్పిరే? యశఃపాత్రులు కారే? వారికన్న జ్ఞానులు కలరే? యాజ్ఞవల్క్యునికంటె వేదాంతియెవరు? అతండు వివాహితుఁడు గాఁడే? అతనిభార్య మైత్రేయికిని అతనికిని జరిగిన సంవాదము సుప్రసిద్ధము గాదె? ఇదియుం గాక పితౄణము పరిణయంబొల్లక తీర్చు టెట్లగును? జరత్కారుని చరిత్రంబు నీకు విదితంబుగదా! మహాతపస్సంపన్నుఁడగు అగస్త్యుండు పితౄణము తీర్చుటకుంగాదె యుద్వాహితుండయ్యె. మఱియును నీతండ్రి వృద్ధుండు, మహాబల పరాక్రమ వంతుఁడు. రాజ్యంబు నీకుంగట్టి సుఖంబుండఁ దలంచినాఁడు. అతనికి నీ వొక్కరుఁడవే పుత్రుండవు. నీవు సన్న్యసించిన నతనికీ రాజ్యం బేల? అతని మనోరథంబు లన్నియు వ్యర్థంబులగును. అతి ఖిన్నుండగును. సకల ప్రాణివ్యథ మాన్ప సమకట్టిన నీకు నీతండ్రి మనోవ్యథమాన్పు టుచితంబుగాదె? పితృవాక్యపరిపాలనంబునం గాదె శ్రీరాముండు లోకవిఖ్యాతుం డయ్యె. హితుండనగు నావచనంబు పాటించి మీతండ్రిని గౌరవించి

యీ పిచ్చితనము మాని నాతోడం జనుదెంచి భార్యాసమేతుండవై కొండొకకాలము భూపాలనమొనర్చి తనయులం గని గోత్రమభివృద్ధి చెందించి మాతండ్రి కపారమైన యానందముం గల్పింపు"మని వచించెను. అనునయ మట్టిపడఁ దియ్యని పలుకులతో సుహృల్లక్షణంబు మెఱయ "మఱిమఱి సదుపదేశంబు గావించితివి. సంతసించితిని. కాని, ప్రాణులకు వ్యాధి జరా, మరణంబులు కలుగుచుండుటచేతను, యౌవనము మార్పులేక స్థిరంబు కాకుండుటవలనను, మాటిమాటికిని గష్టంబులు సంసరణంబున మూడుచుండుటం బట్టియు విషయసౌఖ్యములెల్ల నామదికి నచ్చవు. కాన నన్ని పాడుసంసారంబునఁ ద్రోయంబూనుట నీకు నుచితంబగునె?" యని సర్వార్థసిద్ధుండు ప్రతివచనం బియ్యఁగా "నీవు జ్ఞానమార్గంబున సంచరింప నెంచియున్నావు. అందులకుఁ బరిణయం బాటంకంబు గాదు. పద్మపత్రమందలి జలకణంబు భంగిని, బురదలోని కుమ్మర పురుగువలెను జ్ఞానులకు సంసారంబంటనేరదు. మనోభావమే జ్ఞానమునకుఁ బ్రధానము. 'మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అను వచనంబు సర్వమతసమ్మతంబు, సర్వజనాదరణీయంబు నగు. కాన, సంసారమందుండినను జితేంద్రియుండు సక్తుండు గాఁడు. ఇంద్రియజితుం డెంత జ్ఞానమును సంపాదించినను సంసారమగ్నుండై ముక్తినిగానక పరితపించుచుండును. నీవు అటుగాక ప్రాగ్జన్మ

సంస్కార విశేషంబున సహజజ్ఞానివి. నీకు విషయాదులందు విరక్తిజనించు టాశ్చర్యంబుగాదు. నీకు పరిణయంబు బంధకంబు గానేరదు. అందువలన నేకీడును మూడదు. నీవు మాతండ్రి మనోభావముం గనిపెట్టి వర్తించుట సమ్మతంబు. తనయులకై తపస్సొనరించి, సర్వసుఖంబులు వర్జించి వ్రతంబులాచరించి, భగవదనుగ్రహంబున నెన్నియో యేండ్లకొక్క కొమరుఁడు కలుగంగఁ బ్రాణంబులన్నియు నాసుతునిమీఁద నుంచి జీవించు పితరుల నడలంగాఁ జేయుట పుత్త్రున కుచితంబె? కొండొకవడి ఆలోచింపుము. ఇప్పటికే నీవు విరాగివైతివని మదిఁ గుందుచుఁ గృశించుచున్న నీతండ్రికి నీ యపూర్వప్రసంగములు వినిపించినఁ జింతాక్రాంతుండై కార్చిచ్చువడిన కాననంబు పగిది క్షణంబులో శీర్ణుండగుట యాశ్చర్యంబా? ఎవ్విధంబుగ నైన నీపితకు సంతసంబుఁ గూర్చుట ప్రథమకృత్యంబు. అయ్యది నీవు నాతోడ మారాడక వచ్చుటచే లభ్యంబగును. మాజనకుని వాంఛితంబు వ్యర్థంబుఁ జేయకుము. నరేంద్రకన్యక లెందఱో నగరంబునకుఁ బ్రభు నియోగంబున వచ్చియున్నారు. వారలకుబహుమతులు గావింపుము. నాచేయు విన్నపంబు మన్నింపుము." అని యనేక విధంబుల విష్ణుశర్మ యుక్తివాదములతో నుపపత్తులంజూపి యెట్టకేలకు నృపకుమారు నంగీకరింపఁజేసి తోడ్కొని వచ్చి సభామంటపంబున మహోత్సవంబు సెలంగుచుండ నవరత్న

ఖచితంబైన గద్దియమీఁదఁ గూర్చుండఁజేసెను.

ఆ గద్దియ కిరుగెడలను ధనరాసులు, కనకభూషణంబులు, రత్నహారంబులు, విలువగల చేలంబులు, చీనిచీనాంబరంబులు, వెలలేని వస్తునికరంబులు నుండెను. అంతఁ గుమారీరత్నంబు లొక్కొక్కరుగా నక్కడికి వచ్చి సర్వార్థసిద్ధుం డిచ్చు బహుమతిం గైకొని తరలుచుండిరి. అందు అవయవ సౌష్ఠవముం జెందినయంగనలు, లజ్జాపీడిత భీరువులు, శాంతస్వభావముగల కాంతలు, హేలావిలాసంబునఁ జతురలైన లలనలు, నృత్యగీతాదులందు చాకచక్యముగల రమణులు, రాకొమరుని మోహింపంజేయఁ గలిగిన కామినులు, శారీరలావణ్య సౌందర్యాతిశయంబుఁ గల నారీమణులు అనేకులుండిరి. సర్వార్థసిద్ధుండు నతి శాంతాకారంబుతో స్థిరబుద్ధితో నొక్క కన్నియనైన కన్నెత్తి చక్కఁగాఁ జూడక చేతికివచ్చిన దాని మున్నుందుగా నిచ్చుచు వారలఁ బంపుచుండెను. బహుమానమ్ములఁ గైకొనిన కన్యకలు గుంపులుగుంపులుగా రాజసౌధంబు వెడలుచుండిరి. అట్టిసమయంబున మందగమనయుఁ గోమలాంగియుఁ జంపకగంధియు మృదులాధరయునగు యశోధరాదేవి మణివిభూషణోత్కరమై లజ్జాసంఛన్న వదనారవిందయై చూపఱకు మాతృభావంబు మనంబున నెగడఁజేయుచు సతీత్వంబు మోమున మొలకలెత్త నిశ్చలమానసుండగు నారాజసూనుని యెదుటకు వచ్చి నిల్చెను. అతండు సౌదామినీ ప్రభంబోలిన

దేహకాంతిఁగల యాకాంతం గన్నులెత్తి చూచి అమ్మానిని అపాంగంబులు తన హృదయంబుం గరఁగింప, ఆకుమారికయం దనురాగంబు జనియింప, నొకింత లోన నగి, సత్కరింపఁ దలంపఁ గానుకలన్నియు ముగియుటం గాంచి సరససల్లాపములతో నాసారసాక్షిని నిలిపి తన మెడయందుండిన అపూర్వమైన రత్నహారంబుఁ దీసి యశోధరా కంఠంబునఁ జుట్టఁగా నాకన్నియయు నపార ముదంబందెను. ఈ వృత్తంబు రాజునకు వినిపింపఁగ నాతఁడు సంతసించెను. ఇయ్యిరువురి యన్యోన్యానురాగంబునకుఁ గతంబుఁ బూర్వజన్మ సంస్కారంబే యగు. యశోధరా జనకుఁడును విదితవృత్తాంతుఁడై రణవిద్యలం దన్నిటఁ బ్రజ్ఞావిశేషంబుఁ గలిగిన ప్రతిభాశాలికిఁ దన కూతునిచ్చి పరిణయం బొనర్తునని యెల్లెడలఁ బ్రకటించెను. శుద్ధోదనుఁడును దీనిని విని చింతఁ జెందఁగ సర్వార్థసిద్ధుఁడు తండ్రి కడకేగి "తండ్రీ! విచారమొందఁ గారణము లేదు. స్వయంవరమందు బాహుబల పరాక్రమంబు మెఱయ నా నేర్పుఁజూపి ప్రజలెల్ల 'భళి, భళీ' యనఁగ యశోధరం గైకొని వచ్చెద"నని పలుకఁగ నతఁడు సంతృప్తమానసుండై సుతుని దీవించి భగవంతునిఁ బ్రార్థించి యతనిం బంపెను. యశోధరా జనకుం డొక యంత్రంబు పన్ని దీనిందెగఁగొట్టి వరగుణాఢ్యయగు మత్సుతను గ్రహింపఁ గావలెననఁగ రాజపుత్త్రు లనేకులు విఫల మనోరథులై తలలు వంచు

కొనంగ సర్వార్థసిద్ధుఁడు యశోధరానురాగబద్ధుఁడు కావునఁ బ్రశస్త చాపంబు హస్తంబునం బూని యొక్క తూణంబులో నా యంత్రమును తుత్తునియలుగా నొనరించె. అంత నొక్క వృక్షంబును జూపి దాని నొక్క వ్రేటున ఖడ్గంబుచే నఱుక వలయుననంగ రాజకుమారులలోఁ గొందఱు మాత్ర మట్లొనరించిరి. సర్వార్థసిద్ధుండు నంతకన్న లావైన మ్రానునొక్క యాసిఘాతంబునఁ గొట్టెను గాని అది తెగియుఁ గ్రింద కూలకుండుట గాంచి యందఱును దెగలేదనుకొని 'ఇతఁడు దీనిని నఱుకం బ్రయత్నించుట! ఎంతో బాహుబలము గల శూరులే యీ మ్రానును వదలినారు' అని హేళనంబు పచరింప బృందారకులు మందార పుష్పవర్షముం గురిపించి నిజస్థితిం దెలుపఁగ నందఱును అద్భుతముం జెందిరి. కాని, యశోధరా జనకుం డింకను బరీక్షింప నెంచినవాఁడై అశ్వవిద్య యందును సర్వార్థసిద్ధుం డెంతవాఁడో యను ననుమానంబును దీర్చుకొని ఇతనికన్న నధికుఁడే విద్యయందును గానరాఁడని కృతనిశ్చయుండై మహామోదంబుతో సర్వార్థసిద్ధుఁడే తన కల్లుండు గాఁగలఁడని నుడువంగ, మునుఁ దాఁ వరియించినట్టి శుద్ధోదన తనయుండే తనకు లభియించె నను సంతోషాతిశయంబున వేవేగ నొక పుష్పమాల కేలఁగొని సిద్ధార్థుని గ్రీవంబున నత్యాదరంబుతో వైచెను. అట్టి సమయంబున దేవతలు దివ్యప్రసూనములు గురిపించిరి. అప్సరసలు నృత్య

గీతంబులు సల్పిరి. పదఁపడి పరిణయం బొనరించి పెద్దలగు వారలందఱును వధూవరుల నాశీర్వదించిరి. మహోత్సవంబుఁ గావించిరి., రాజ్యమం దంతటను ప్రజలు ఆమోదముం జెందిరి. కొండలు, సెలయేళ్లు, పొదరిండ్లు, సకల వృక్షజాతులు, పుండరీకాది పుష్పములచే నలంకరింపఁ బడిన సరస్సులు మొదలగు శృంగార ప్రధానములన్నియుఁ గలిగి కన్నుల పండువుగా నుండు నొక యారామంబునఁ దనజనకునిచేఁ గట్టింపఁ బడిన హర్మ్యంబునందు ఆనందమయమైన కేళీసదనంబునందు సర్వార్థసిద్ధుఁడు యశోధరతో నానంద మనుభవించుచుండెను. ఆపద్వార్తయైనఁ జెవ్రులకు సోఁకకుండు నటులు శుద్ధోదనుండు లోపలివారలు వెలుపలికిని, వెలుపలి వారు లోపలికిని జనకుండ భృత్యులకు నియమించి సుందరమందయాసలఁ గుమారు మనంబు లోఁగొనుఁడని నియోగించి సుఖంబుండె. లతాగృహంబులలోను, పొదరిండ్లలోను, పూఁదోఁటలలోను సరోవర ప్రాంతంబులందును, శృంగారోపవనంబులందును సర్వార్థసిద్ధుఁడు యశోధరం గూడి లలనాపరివృతుఁడై నిరంతర క్రీడావిలాసంబులం దేలుచుండె.

ఈ ప్రకారంబుగా లీలాలోలుఁడై పురావృత్తాంతంబులన్నియు మఱచి కాలంబు గడపుచుండ దేవతలయ్యెడకు వచ్చి

ఉ. "ఎందులకున్ జనించితి మఱేమి యొనర్చుచునుంటి వీజగం
బందు నహింస యెల్లెడల వ్యాప్త మొనర్పుము, రాజ్యపాలనం
బందును నిట్టి సౌఖ్యములయందును మున్గక వ్యర్థమైన వే
డ్కం దిగఁద్రావి వైళ ముపకారము లోకులకుం బొనర్పుమా!"

అనుచుఁ బ్రతిదినంబును బోధించుచుండ ప్రపంచవిశేషమ్ముల నెఱుంగ సారథిని రథం బాయత్తంబు చేయుఁడని నియమించెను. రాజా సంగతి విని తనయునకది రాజ్యకాంక్ష యని తలఁచి నగరం బలంకరింపఁగఁ జాటింపఁ బౌరు లతిమనోహరంబుగను రుచిరంబుగను బురం బలంకరించిరి. అంధులు, కుష్ఠులు, వికలాంగులు, జరాపీడితులు, శోకవంతులు, వ్యాధిగ్రస్తులు మొదలగువారెవ్వరును రాజవీథులందు రాకొమరునికిఁ గాన్పింపకుండ రాజాజ్ఞ ప్రకటింపఁబడియె. ఆయత్తంబైన స్యందనంబు నధిష్ఠించి రాజపుత్రుఁడు పురవిశేషమ్ములఁ గొన్నింటిఁగాంచి నలుగెడలఁ దిరిగి స్వస్థానంబునకు మరలెను. ఆనాఁటి రాత్రి శుద్ధోదనుఁడు వివిధ స్వప్నములఁ గనెను. ఆకలల ఫలితంబు తనయుఁడు సన్న్యసించుటయే యగునని తలఁచి పుత్ర వియోగంబు గలుగునని యెంచి శుద్ధోదనుఁడు విచారగ్రస్తుఁడయ్యెను.

ఆమఱునాఁడు సిద్ధార్థుఁడు యథాపూర్వంబుగ రథంబు నెక్కి పురంబవలోకింపఁ జనఁగ నాదినంబున మరణావశిష్టుఁడగు నొక యువజనుని, వివిధ రోగ వ్యథాపీడితు నొకనిని గని

మనంబున సంతాపంబు జనింపఁగఁ దన సారథి యగు చెన్ననితో వారికష్టములఁ గూర్చి కొంతవడి ముచ్చటించుచుఁ గొండొక దవ్వరుగ నక్కడ మృత కళేబరంబు చుట్టును జుట్టాలుచేరి అధికముగ విలపించు చుంటఁ గాంచెను. అయ్యది శ్మశాన వాటిక యగుటంజేసి శీఘ్రముగ నామృతున కగ్ని సంస్కారంబుఁ గావింప నాకాయంబు వహ్ని గాల్ప బూడిద యగుచుండ 'ఇట్టి యవస్థ మనకును సంప్రాప్తమగును గద' యని చెన్ననితోఁ బలుకఁగ "దేహమునకు జననము మరణము స్వభావ ధర్మములు. తిరిగి పుట్టుట తిరిగి గిట్టుటయే శరీరికి ధర్మములు. ఆద్యంతములు గానరాని యీ మహా సంసరణంబునకే సంసారమని పెద్దలు పేరిడిరి. ఇయ్యది చక్రపరిభ్రమణము వంటిది. కర్మానుగతి సుఖదుఃఖంబులు శరీరి అనుభవించుచుండు. బాల్యము, కౌమారము, యౌవనము జరయు నెట్లు క్రమముగ సంప్రాప్తమగునో అదేవిధంబుగ మరణంబును తటస్థమగుచుండు. దీనిని గుర్తెఱింగియు శరీరాభిమానంబు వదలలేక జనులు వగచుచుందురు" అని చెన్నుండు పల్కుచు రథంబును నడపుచుండ నొకముదుసలి గానంబడియె. వృద్ధత్వంబున నడుమువంగఁగ దుర్బలత్వంబున శరీరము గడగడ వడఁకఁగఁ బదములు తడఁబడఁగఁ గరంబున నొక దండం బూఁతఁగా నిడికొనిన యావృద్ధునింజూచి బుద్ధుఁడు చెన్ననితో నిట్లనియె: 'చూచితివా జరాస్వభా

వంబు. పాపము! రూపము మాఱిపోయెను. బలంబు గ్రుంకెను.
బుద్ధి క్షీణించెను. విద్యాపటిమ అడుగంటెను. సంతాపము
హెచ్చెను. ఆశలు మెండయ్యెను. ఆహా! ఎట్టియవస్థ దెచ్చెను.
ఇటుల ప్రశంసించు చుండఁగ నిజ ప్రాసాదంబు రథంబు
ప్రవేశించెను. దయామయుఁడగు నామాయాదేవి పుత్త్రుఁడు
జరామరణంబులను జయింప నెంచి ఆరేయియెల్ల వైరాగ్య
విచారంబునఁ గడపి మఱునాఁ డుదయంబున బుద్ధుఁడు కతి
పయ హితులంగూడి వనవిహారార్థంబు హిమాద్రికిం జన
నెంచి తనకు ప్రియంబగు కంటకంబను నశ్వంబు నెక్కి శీత
నగంబున నెక్కి మహారణ్యముఁ జొచ్చి కొంతదూరం బరు
గఁగ నక్కడ ముండిత శిరస్కుఁడును, కరధృత దండుఁడును,
కాషాయాంబర ధరుఁడును, విభూతి విభ్రాజిత ఫాలుఁడును,
ఏకతముండైన యతనిఁగాంచి "నీవెవ్వఁడవు, ఎందులకీ ఘోర
కాననంబున నీవేషంబున నున్నావు? నీయభీప్సితం బెద్ది? నీ
జననీజనకులు నీవిట్లుండుట కంగీకరించినారా? నీభార్య
నెక్కడ విడిచితివి, ఏగతి పట్టించితివి?" అని అడుగఁగ నాముని
"రాజా! నీవెంత వెఱ్ఱివాఁడవు. తలిదండ్రులెవరైన తనయుని
వియోగ మభిలషించెదరా! పరిణయంబు బంధకమ్మని యె
ఱింగిన వాఁడనై వివాహమాడక, సుతదుహితృ కళత్ర బంధు
మిత్త్రాదులు అను అడుసుకలిగిన యపారపారావారంబైన
సంసారంబొల్లక ముముక్షువునై తలిదండ్రుల కన్నొఱంగి వచ్చి

యీ యుగ్రకాంతారంబున సన్న్యాసినై తప మాచరించు
చుంటిని. మోక్షమందిచ్చ గలవారికి సంసారము మహాసాగ
రమువంటిది. అందు తృష్ణ తోయమువంటిది. పవనోద్ధూతో
ర్మికామాలలు మదనప్రేరిత మోహజాలములు. దారపుత్త్రాది
వర్గము సహజగ్రాహసంఘము. ఇట్టి మహాబ్ధియందు మునుంగఁ
జాలక సన్న్యాసికి ధర్మంబైన కావిచేలంబులు, కమండలువు
దండంబును ధరించి శిరోముండనంబు గావించుకొని సాంసారి
కులుండు జనపదంబును విడిచి పెద్దలసుద్దులను పాటించి యి
చట కాలంబు గడపుచుంటిని. ఈవేషంబు యతుల కుచి
తంబు. ముక్తికిది కారణంబుగాని ప్రతిబంధకంబుగాని కాదు."
అని వచించెను. దానినంతయు నాలకించి రాజపుత్త్రుఁడు
ఆమునికిట్లు వినిపించెను. "యతిసత్తమా! సన్న్యాస మనఁగ
నాలుబిడ్డలను బంధుమిత్త్రులను విడనాడుట కాదు. సాంసారి
కులుండు పట్టణములను బల్లెలను ద్యజించి విపినాంతరము
లకుఁ బోవుటయుఁ గాదు. విధివిహిత పరిణయాదికర్మ లను
విడుచుటచేతను పురుషుఁడు సిద్ధిం బొందఁజాలఁడు. కర్మేం
ద్రియంబులను సంయమించి మనస్సుతో విషయములను
స్మరించు మూఢునికంటె ఇంద్రియములను స్వాధీనము చేసి
కొని ఫలాపేక్ష లేక ప్రపంచవ్యాపారములందుఁ బ్రవర్తించు
వాఁడే శ్రేష్ఠుఁడు. సన్న్యస్తసంకల్పుఁడు సన్న్యాసి యగును
గాని యితరులు గానేరరు. యువతీపాశమునందుఁ దగుల్కొనక

జ్ఞాననిష్ఠుండు తరణోపాయమును వెదకుచుండును గాని యీ వేషంబు నిష్ప్రయోజకంబు."

ఆ యతిశ్రేష్ఠుండును "రాజశేఖరా! నీవు నుడివిన దంతయు సత్యంబు. అయినను, ధ్యానమునకు వివిక్తప్రదేశంబు ప్రధానంబు. జ్ఞానముకంటె ధ్యానమువిశేషము. ధ్యాననిష్ఠం జెందుటకుఁ గొన్ని సాధనములు గలవు. అట్టిది నిర్జనప్రదేశ మొండు. జనపదములను విడుచుట అట్టివారికి ముఖ్యము. ధ్యాననిష్ఠం బొందినవారలు సన్యస్తసంకల్పులును జితేంద్రియులును గాన వారలెవ్విధంబుగఁ బ్రవర్తించినను వారి కేదియు నంటఁజాలదు. తదేక ధ్యాననిష్ఠంబొందఁ బ్రయత్నించుట మానవులకెల్ల ముఖ్యధర్మం" బని పలికెను. ఈ మాటలు బుద్ధుని మనంబున గాఢముగ నాటుకొనెను. ఆ యతికి నమస్కరించి వీడ్కొని మిత్రులంగూడి నిజనగరంబునకు మరలెను. అదిమొదలు బుద్ధునికి విరాగంబు విశేషమయ్యెను. ధ్యాన నిష్ఠయం దపేక్ష అధికమయ్యెను. రాజ్యకాంక్ష అడుగంటెను. హర్మ్యంబులు, హంసతూలికా శయనంబులు, కేళికోద్యానంబులు, పరిచారికాసమూహంబులు, చిత్రాలంకృత ప్రాసాదంబులు అతని మనము నాకర్షింపలేకపోయెను. బుద్ధుండు సంక్షుభిత మనస్కుఁడై గాఢనిద్రం జెందియుండఁగ నర్ధరాత్రంబున యశోధర కన్నీరు కాల్వలు గట్టుచుండ దిగ్గునలేచి భర్తను లేపగ నతండు విహ్వలాత్మయైన సతిని

గాంచి, అనునయించి వగపునకుఁ గారణం బెఱుఁగఁ జెప్పుమనిన "నాథా! పాడుకలం గంటిని. ఒక పెద్ద యాఁబోతు కొమ్ములఁ జిమ్ముకొంచు పెద్దకొండవలె నాయెదుటఁ గన్పడియె. అప్పుడు 'ఆయెద్దును బట్టలేకుండిన మీభాగ్యమంతయుఁ బోవు'నని ఆకాశవాణి బిగ్గరగఁ బలికె. ఎవ్వరును దానిం బట్టలేకుండిరి. చిక్కకుండ తప్పించుకొని నాముంగలకు వచ్చిన యావృషభంబును నేఁగట్టిగాఁ బట్టఁగ నయ్యది హుమ్మని యార్చి నా పట్టు వదలించుకొని రంకెవేయుచుఁ బరుగెత్తి పోయెను. ఆ కేకకు నేనులికిపడి లేవఁబోవఁగఁ 'గాలము సమీపించె నింక నాలస్యమేల' యను నొండు పలుకు వినఁబడియె. అంతట నెటు చూచినను మిమ్ములఁ గననైతి; ధరించునట్టి వస్త్రములు మాత్రము గనంబడెను. చేతికంకణంబులును గాళ్ల కడియములును జాఱెను. పడక నేలంబడెను. గుండెలు జల్లుమనెను. ఇట్టి యశుభస్వప్నమువలన మన యిద్దఱిలో నేరికైన మరణము సంభవించునని యెంచి నాకుఁ బట్టరాని దుఃఖంబు కల్గెను." అనఁగవిని సర్వార్థుండు నవ్వి "యీ కలవలన మన కిద్దఱకు నేదోసఁగును బొసఁగదు. సూర్యునిఁబోలు పుత్త్రుండు నీకుఁగల్గును. మన సంబంధమెన్ని మార్పులు కలిగినను ఇదే విధంబుగ నుండునని మనమ్మున నిజమ్ముగ నమ్ముము. నా మాటలను విశ్వసింపుము." అని పరిపరివిధంబుల నామెకు నుచితభాషలం బలికి "దుఃఖమునందు మగ్నులైన జనులకెల్ల

నుపకారము నేఁజేయవలసియున్నది. నేఁబోవు మార్గంబుననె నీవు రావలసియుండును. నాచే జ్ఞానోపదేశముం గాంచునట్టి నాశిష్యులలో నిన్ను అగ్రగణ్యగనే సన్మానించెదను. నామాట నిజమ్ముగనుగొనుము."అని పెక్కుభంగుల నామెకు దుఃఖోపశమనంబుగావించి ఆమెకుఁ గలిగిన సంశయంబు విచ్ఛేదంబు చేసి మరల నిద్రింపఁజేసెను. అట్టి సమయంబున దేవతలు బుద్ధునికి హెచ్చరిక యొనరించిరి. నగరంబు విడిచిపోనెంచి చెన్నునిలేపి తన యుద్దేశం బెఱిగించి కంటకంబను నశ్వంబు నాయతంబు గావింపుమనినఁ జెన్నుండు "మిసిమిప్రాయమందున్నవాఁడవు. నిష్కారణంబుగ నీయర్థరాత్రంబున దొంగతనంబుగ నీయర్థాంగిని దిగవిడిచి విరాగివై పోనెంచితివి. సన్న్యాసము బహుకష్టసంకలితము. కటికనేలయే హంసతూలికాతల్పము. గృహస్థులిచ్చు భిక్షలే పంచభక్ష్యపరమాన్నంబులు. కావిశాటులే జల్తారుపట్టుపంచలు. తృణాంకురంబులే తూఁగుటుయ్యేలలు. గిరిగుహాలే రత్నసౌధంబులు. తిన్నచోట నిలువరాదు. నిలిచినచోట నిద్రింపఁగరాదు. ఘోరకాననంబులు పూఁదోటలగునా? గాఢాంధకారగుహాలు క్రీడాగారంబులగునా! వన్యమృగంబులు పరిచారికా బృందమగునా? నడిప్రాయముననున్న నీవు ఇట్టి పనులం దల పెట్టుట తగునా? తన ప్రాణములతో సమానముగ నిన్నుఁ జూచికొనుచుండు నీతండ్రిని సంతత దుఃఖనిమగ్నునిఁజేయ నీకుం

జెల్లునా? అది న్యాయమా?" అని యనేకరీతుల నుగ్గడించినను బుద్ధుండు చెన్నునికి జ్ఞానబోధసేయఁగ నతండు భక్తి విశ్వాసంబులు మెఱయఁ దత్క్షణంబ కంటకంబును నాయితమ్మొనర్చిన నద్దానినెక్కి యొక్క మహారణ్యమ్ము క్షణమ్ములోఁజేరెను. దేవతాప్రభావంబున గుఱ్ఱపుగిట్టల చప్పుడు ఎవ్వరికిని వినఁబడలేదు. నగరప్రాకార కవాటంబులు మార్గమిచ్చెను. తత్ప్రభావంబుననే, బాణంబు భంగి నతిత్వరితంబుగఁ బరుగిడిన వారువంబుతోఁ గూడ నడువఁగలిగిన చెన్నునిఁ జూచి "నీకుఁగల భక్తి విశ్వాసములు నీ యమానుషకృత్యంబును నాయుల్లంబునకుఁ దేటతెల్లంబయ్యె. రాజ్యకాంక్షలేని నాయందు నీకింత యాదరంబుండుట ప్రపంచ విరుద్ధంబు. శోకత్యాగంబునకై చనుచున్న నన్నుంగూర్చి శోకంబువదలుము. పురుషున కర్థదాయాదులు దొరకుట సుకరంబుగాని ధర్మదాయాదులు దొరకుట దుర్లభంబు. ధర్మంబు సమయ మపేక్షించునది కాదు. అశాశ్వతమగు దేహముల మతిమంతులాస్థ యొనరింపఁదగదు. కావున, నీవీ కంటకంబుతోడఁ బురంబునకుం బోయి మజ్జనకుండు నన్ను మఱచునట్లు హితోపదేశంబు లొనరింపుము. దేహులకుమృత్యువు నీడవలెనుండును. ఎన్నటికైన వియోగంబు సంప్రాప్తింపక మానదు. ఇట్టి వియోగంబునకు విషాదంబు నొందుట నిరర్థకంబు. దేహామునకు స్వభావంబైన జననమరణ రాహిత్యంబునకై విరా

గిసై నిర్జనారణ్యంబున దుంపలను గడ్డలను ఆకులను ఆహారముగాఁ జేసికొని కతిపయవత్సరంబులు గడపనెంచితినని నాతండ్రితో నుడువుము." అనఁగఁ జెన్నుండు దుఃఖపరీతాత్ముఁడై "నేనే మొగముఁ బెట్టుకొని పురంబునకుఁ జనఁగలను? నీచుట్టములతో నేనేమని చెప్పఁగలను? ఎంత వచించినను వారలు నన్ను దూషింపక మానరు. ఇన్నినాళ్లనుండి నీఘోటకంబును నిన్నును అధికభక్తివిశ్వాసంబులతోఁ గొల్చినందులకు ఇదియా నాకు నీవొసఁగఁ దగినకార్యంబు? నిన్ను ఘోరవిపినంబుల డించి పురంబునకు మరలంగ నాకుఁ గాళ్లురావు. నన్నుఁగూడ వర్జింప నీకు మనసుపుట్టెఁగదా?" అని వగవఁగ బుద్ధుఁడు, "దేహము లనేకవిధంబులు, వారి యభిప్రాయంబులు భిన్నంబులు, బాంధవ్యంబులు కల్పితంబులు. ప్రేమాభిమానంబు లారోపితంబులు. ఇప్పటికెన్ని జన్మములెత్తితిమో! అన్నింట నీ సంబంధము లేయుండెనా! యోచింపుము. నాతోడ నీవుండిన ప్రయోజనంబు లేదు. విజ్ఞానామృతము లభించిన పిదప దాని నీవుఁగూడ గ్రోలంగనగును. నేను నిరంతర ఘోరకాంతార నివాసముఁ జేయఁ దలంప లేదు. అభీప్సితార్థంబు లభించినతోడనే శీఘ్రంబుగ నే మరలవత్తును. నేఁ జేయఁగలకార్యంబు పరోపకారంబును అహింసయుఁ గాన నాకు జనపదంబులలోనే విశేషముగఁ బనియుండును. కానఁ, దప్పక తిరిగివచ్చెదను." అని శోకమగ్నుం డగు మత్రితోఁ

బల్కి ఆయనదుఃఖ మనునయించి సుఖంబు సంధింపుము' అని పలుతెఱంగులఁ దత్వం బుపదేశించి చెన్నుని యొప్పించి పిన్ననాఁడు తనతండ్రియిచ్చిన నానావిధ భూషణంబులను దీసి 'నాకిఁక నివియేల? వీనిం గైకొనుము. నాపేరుగ ధరింపుము' అని తనకుంగల కూర్మిఁజూపి కంటకంబును దనహస్తంబున దట్టి ఒడలంతయునిమిరి 'నీకును నాకును గల ఋణానుబంధంబు నేటితో తీఱెను. నా యపరాధంబు వహింపుము. నీవుపడిన శ్రమ ఫలప్రదమగును. పురంబునకుఁ బొమ్మ'ని నుడువఁగ జెన్నుండును గంటకంబును నృపాలకుమారుని విడువలేక కన్నీరు మున్నీరై కాల్వాలు కట్టుచుండఁ జనలేక వెనుకకుఁ దిరిగి చూచుచు ముందుకుఁ దీసికొని పోఁబడు ధ్వజాగ్ర మందలి చీనాంశుకము భంగి కపిలవస్తు నగరాభిముఖులై వెళ్లిరి.

గౌతమబుద్ధచరిత్రము

తృతీయాధ్యాయము

బింబిసారుఁడని యొకరాజుండెను. అతనికి రాజగృహమను పట్టణంబు రాజధానిగనుండెను. ఆనగరంబునకు సమీపంబున రత్నగిరియను పర్వతముండెను. అందు నానాజాతి వృక్షంబులు, వివిధకందమూలమ్ములు, ఆకాశగంగాధారలు, శ్రవణములకింపుగ గాన మొనరించు అండజనికరంబును, ఆశ్రమోచిత ప్రదేశంబులు గలవు. ఏవంకఁజూచినను ఆగిరి యత్యంత రమణీయంబుగ నుండెను. ప్రపంచపరమార్థ జిజ్ఞాసువులకు ధ్యానానుకూలములైన వస్తుప్రకరంబంతయు నందు బొందుపడియుండెను. గౌతమబుద్ధుఁడు ఆరేయి చెన్నునిఁబంపి యీరత్నగిరిం జేరెను. అంతఁ బ్రాభాతిక ప్రభలు ప్రపంచమంతటను బ్రసరింపఁదొడంగెను. 'అట్టిసమయంబున సార్వభౌమునిపదంబు జెందనుండినవాఁడు సన్న్యాసియయ్యెను కటా' యని దిక్కులెల్ల వెల్లనయ్యె. రారాజసూనుం డొనరింపఁదగిన కృత్యంబు లివి కావు కావు అని కాకములఱవసాగెను. ఇఁకఁ బ్రపంచమందలి అజ్ఞానమంతయుఁ బటాపంచలై పోవు నన్నట్లు చీకట్లు మాయమయ్యెను. దుర్మతంబులన్నియు

నశింపఁగలవని నుడివినభంగి నక్షత్రంబు లడఁగిపోయెను. లోకమునకంత శుభంబుకలుగునని నుడువుపోలిక పూర్వసంధ్యారాగంబు హేమమయదీప్తితోఁ బొలుపువహించెను. జ్ఞానమీరీతి నిఁక నుదయించునని నుడువుపగిది భానుండు ప్రాగ్దిశయం దుద్భవించెను. పంకజమ్ములు వికసింపఁదొడంగెను. భ్రమరంబులు ఝూంకార మొనరింప మొదలిడెను. చక్రవాకంబులు సూర్యున కభిముఖంబులయ్యెను. రత్నగిరి యంతయు బంగారుపూత పూయఁబడినట్లుండెను. వృక్షాగ్రంబులన్నియు నిగనిగమనుజిగితో రాజిల్లుచుండెను. భూదేవి జగద్బాంధవుఁడగు సూర్యదేవుని ఆరాధించుటకు వస్తునిచయంబు సమకూర్చుకొనుచున్నదో యని చూపరులకుఁ దోప సిరెండ నిఖిలదిశలనిండెను. సర్వార్థసిద్ధుండును దైవమహిమవలన నక్కడ సంసిద్ధములుగానుండిన దండంబును కమండలువును గాషాయంబును ధరించినవాఁడై ధ్యాననిష్ఠాగరిష్ఠుండయ్యెను. అపరాహ్ణసమయంబున నాగిరిచెంతనుండు మార్గంబున రాజగృహంబునకుంజని అందొకయింటికేగి బికిర మెత్తెను. ప్రతిదినంబును అదేవిధంబుగ నాపట్టణంబునకు మాధుకరంబునకై వెళ్లుచుండఁగ నానగరంపు పురంధ్రీమణులకెల్ల నాశ్చర్యప్రమోదాతిశయంబుఁ గలిగె. సుకుమారత్వముం దెల్పు శరీరలావణ్యము, ఏకాగ్రచిత్తముం జూపు నేత్రసౌష్ఠవంబు, భగవద్ఘనాంశమును వ్యక్తీకరించు

ముఖవర్చస్సు, మహానుభావత్వమును బ్రకటీకరించు విగ్రహా లక్షణంబు, ధీప్రతిభను వెలిబుచ్చు విశాలభ్రాజిత్ఫాలంబు, సౌందర్యమును అతిశయించునట్టి నల్లని భ్రూలతలు, ధీరత్వమును బహిరంగపఱచు విశాలవక్షస్థలంబును ఆజానుబాహువులును, మహాపురుషత్వమును సూచించు శంఖచక్రగదాదరరేఖావిభ్రాజితంబులగు హస్తంబులును గలిగిన ఆయతీంద్రుని అచిరకాలంబుననే ఆపట్టణమందుండు ఆబాలగోపాలముగ నందఱకును నిశ్చల నిర్జిత నిర్మల మానస ప్రభావంబున భక్తి, గౌరవము, ఆశ్చర్యము, ఆనందము అపరిమితంబుగఁ గలిగెను. అతని కాషాయాంబరపు టంచులను కన్నులకద్దుకొనువారును, సాష్టాంగ నమస్కారంబు లొనర్చువారును, దూరముగనుండి చేతులను జోడించువారును, బిడ్డల నెదురుగఁ బంపువారును, కీడు మూడకునికి శుభంబుకలుగుటకును వేళంగనిపెట్టి ద్వారములందుఁ గాచియుండి బుద్ధుండు వచ్చు సమయంబునఁ దమంతటఁదామే అతనికి బిచ్చమిచ్చుచుండెదరు. ఎట్టి ప్రాయంపు రూపరులైనను దముఁ గాంక్షించి ఎంతదూరమునుండి వచ్చినను ఎంతకాలముండినను వారలకు దుర్లభులగు నాపురకామినులు మాధుకరంబునకై యానగరమునకు వచ్చెడు కాషాయవేషుఁడగు నీబిచ్చగాని ప్రభాలావణ్యముల కచ్చెరువొందుచు నిరంతరభక్తితోను శుద్ధమైన ప్రేమతోను, వాస్తవమైన గౌరవముతోను ఆశాటీధారునికిఁ

బూజసేసి బిక్షులర్పించుచుండిరి. కాని జగద్వంద్యుండగు మాయాదేవీసుతుండు సర్వకాల సర్వావస్థలందును దదేకాయత్తచిత్తంబుతోఁ బ్రపంచపరమార్థముంగూర్చి ధ్యానంబుసల్పుచుండెను. మాధుకరసమయంబునకు మాత్ర మారాజగృహమునకు వెళ్లి తిరిగి రత్నగిరి దరికరుగుచుండెను. రాజగృహమందుండువారలకందఱకును యతీంద్రుని మహానుభావత్వము మనసునఁబట్టెను. ఇటులఁ గొన్నినాళ్లు గడచినపిదప నొక దినంబున శాటీధారుఁడు నాకొండంతయుఁ గలయందిరిగెను. ఆధరాధరదరీద్వారంబులం దనేక మహానీయుల నతండు దర్శించెను. వారిలోఁ గొందఱు ఆహారనీరంబులు వర్జించి కాయమును గృశింపఁ జేసిన వారును, నిలువంబడి మిన్నువంకఁ గన్నుల సారించుచుఁ జేతులు జోడించి పైకెత్తి దలకని నియమము కలవారును, ఇనుపమేకులు పైకిపొడుచుకొని వచ్చియుండు పాదరక్షలమీఁద నడుచుదీక్షగలిగినవారును, జడలు దాల్చి గోళ్లుపెంచి స్మశానంపుపేలికలను ధరించి పీనుఁగులను గౌఁగిలించుకొనువారును, నానావిధ హఠయోగులును అతనికిఁ గానవచ్చిరి. బుద్ధున కత్యంతాశ్చర్యంబగుడు వారల సమీపమునకుం జని యొకవృద్ధుంగాంచి అతనితో సర్వార్థసిద్ధుండు "మునీంద్రా! మీరలుసల్పు దుష్కృత్యములకు నామనంబు ఖిన్నత్వమొందుచున్నది. మనశరీరము దుఃఖము ననుభవించుటకుఁ దగినదైనను మీర లీవిధంబుగ దాని

యింత స్వారోపితాధి క్లేశపాత్రముగ నొనర్ప న్యాయమా?’ అని యడుగ నతఁ డిట్లనియె. ‘కాయమును గష్టముల పాలుసేసిన నరకబాధల నన్నిఁటిని సహింప వచ్చును. ఆ యముండు కూడ మా యీ సహనమునుఁ జూచి విస్మయముఁ జెంది మాకు పుణ్యలోకముల నిచ్చును. ఇట్టి బాధల వలన పాప పుంజంబులు బహువడి పరుగిడి పోవును. ఇది మా మత సిద్ధాంతము. అందు వలన మేమాచరించు చున్నారము.’ మాయాదేవేయుఁడు “మహాత్మా! మీకు కాయ కష్టముచే సంపాదింప నెంచిన సుఖంబు కాలక్రమంబుగ వ్యయమైనచోఁ దిరిగి యీ దుఃఖము ననుభవింపవలసినదే కదా! నశ్వరంబులగు వాంఛలు నిరర్థకములు. మఱియు నూర్ధ్వలోకమునకు వెళ్లినవారు తిరిగి క్రిందికి రాకమానరు. అందుకు దృష్టాంతమొండు వక్కాణించెద. సముద్రమందలి నీరు సూర్యుని కిరణ వేడిమిచే నావిరిరూపమై ఊర్ధ్వమున కేగి మేఘములై, అవియే చల్లని గాలి సోకఁగనే తిరిగి నీరై వర్షరూపమున భూమిపైఁ బడుచున్నవి. ఆ నీరే కాలువలై మడుగులై, నదులై, స్వస్థానమగు నబ్ధిం జేరుచున్నవి. అదే విధంబుగ నూర్ధ్వగామికి స్వస్థానంబు సిద్ధంబు” అని ప్రశ్నింప నమ్మునీంద్రుడు “మహాత్మా! నీవు నుడివిన దంతయు నిజమౌనో కాదో నాకుఁ దెలియదు. మాకు నిశ్చయ జ్ఞానంబు లేదు. శరీరంబు మోక్షంబునకుఁ బ్రతిబంధకంబు. రాత్రి

గడచిన పిదప పవలును, పెద్ద తుపాను గొట్టిన పిమ్మట తెరపియుఁ గలుగుభంగి కష్టముల యనంతరము సుఖంబు నొదవ గూడునని మా నిశ్చయంబు. అట్టి సౌఖ్యం బేనాఁటికైన నశ్వరంబగు నదియే యని ఆక్షేపించినఁ బరబ్రహ్మ మొక్కఁడే శాశ్వతంబు. తదానందం బొక్కఁటే అనశ్వరంబు” అని పలుకంగ బుద్ధుఁడు మీర లెంతో పావనులు, తెల్విగలవారలు, కలవలే క్షణభంగురంబైన సుఖంబు వాంఛించి పరతత్త్వజ్ఞాన సంపత్తికి సాధనంబైన కాయంబును బాధలు పెట్టి కృశింపఁ జేయుచున్నారు. బ్రతుకుకుఁ గారణంబైన శరీరంబు పోయిన జ్ఞానంబు లభించు టెట్లు? దేహంబుఁ బాడుగావించి బ్రతుకఁ గోరుచున్నారు. ఆహా! ఎంతబుద్ధిహీనత! ఇట్టి కష్టముల ననుభవించుట యే దేవతలకుఁ బ్రీతియో! పశుపక్షి మృగాదుల కన్న మిన్నయగు బుద్ధి వొడమిన మీరలు నిష్ప్రయోజనంబుగ దేహమునకు వినాశంబు మిథ్యాయోగ మార్గమునఁ గలుగఁ జేయుచున్నారు. దీనివలన మీకుఁ గాని ప్రపంచమునకుఁ గాని మేలు సమకూడదు. అని వారలకుఁ దెలియం జెప్పి నిజాశ్రమంబునకుఁ జని యథాపూర్వంబుగఁ గాలంబు గడపుచుండెను.

అక్కడ కపిలవస్తునగరంబున యశోధర వేకువజామున నిద్ర మేల్కాంచి ప్రాణనాథుఁడు లేని తల్పంబుఁ గాంచి “అకటా! ఎంతపాడుకల! నేఁడే ఫలంబు గన్పట్టెనని తలంచి

చెలులం బిలిచి నాథుని వృత్తాంత మడుగ వారు మే మెఱుంగ
మని నుడువగఁ గంటకంబున్నదా? చూడుడని నియోగింప
వారచటికి వెళ్లివచ్చి అది లేనిసంగతి తెలియం బలుకఁగ
తీవ్ర శోకానల దహ్యామాన మానసయై సన్న్యాసియయ్యె
నొకో" యని ఆమె మూర్ఛిల్లెను. ఈ వార్త తంతి గొట్టిన
విధంబున నొక్క నిమేషంబులోన పౌరులందఱకును విదితం
బయ్యెను. పురంబంతయు నల్ల కల్లోలంబయ్యె. ప్రాకార
ద్వారంబులు మూసినవి మూసినట్లే యుండె. వేసిన తాళ
ములు వేసినట్లె యుండెను. ఏ విధంబుగఁ దాఁటెనో గదా!
తప్పక ఆకాశ మార్గంబున నేగియుండవలయు. దైవకృత్యంబు
లాశ్చర్య జనకంబులు. అని అందఱు ననుకొనుచుండిరి. శుద్ధో
దనున కీ వార్తలన్నియు సేవకులు వినిపించిరి. అతని గుండి
యలు ఝల్లుమనియె. దృష్టి నిలువంబడియె. మనంబు వికలం
బయ్యె. తెలివి తప్పెను. మూర్ఛవచ్చెను. శీతలోపచారంబులు
కొంతతడవు సేయంగఁ బూర్వజ్ఞానంబు కలిగెను. అగ్గలమైన
శోకభరంబున మాటాడ లేకుండెను. తెప్పరిల్లుకొని మంత్రు
లనుఁ జూచి యేమో పలుక నెంచఁగ నమాత్య పుంగవుం
డొకఁడు 'కుమారాన్వేషణంబున కన్ని దిశలకు పురో
హితులను జవసత్త్వ విఖ్యాతములౌ ఘోటకంబుల నిచ్చి
పంపితిని' అని వినయపూర్వకంబుగ మనవిఁజేయ రారాజు
వారు వచ్చువఱకు నేనును ఆహార పానీయంబు లవలఁ ద్రోచి

దేవాలయంబున నుండి యుచిత శాంతికి క్రియల నొనరింపు
చుండుననియె.

మూర్ఛిల్లిన యశోధరాదేవికిఁ గొంత తెల్వి వచ్చెను.
దగ్గరనుండిన చెలులు ఆమె ననునయంపు భాషణంబుల నూఱ
డించిరి గాని యామె శోకం బపరిమితంబుగ నుండెను. ఎట్టి
భరింపరాని దుఃఖమైనను దినములు గడచిన కొలఁది సహజ
మగు చుండుట స్వభావ ధర్మము కదా! పట్టణమందలి పౌరు
లతో మంత్రివరుండు పంపినవారలు రాజసూనునిఁ దోడ్కొని
రాకయుందురా? ఆహా! ఎంతటి దురవస్థ శాక్యవంశపు
రాజులకుఁ గలిగె! ఇంతటితో నీ వంశము సరి కాఁబోలు!
ఏల ఇంత విచారము? రాఁడా రేపో మరునాఁడు? సన్న్యా
సము రాజపుత్రుండు స్వీకరించునా? స్వీకరించెఁబో నాయువ
స్థకుఁ దాళఁ గలఁడా? అకటా! ఈ రాజున కిది రాఁదగిన
కష్టము కాదు. మొదటినుండియు సర్వార్థ సిద్ధుఁడు విరా
గియే. మొదలువిరిచి గుదికొయ్యఁ దగిలించిన మాత్రమున
మనసు మరలునా? ఉగ్గుపాలతోఁ గలిగిన వైరాగ్యము
ఉద్వాహముతో నూడునా? నిజముగ రాజతనయుండు సన్న్య
సించియే యుండును. లోకమున శోకమును బోఁగొట్ట నెత్తిన
యవతార పురుషుండని కొందఱు ప్రాజ్ఞు లితఁడు పుట్టినపుడే
వచింపలేదా! అని పరిపరి విధంబులఁ జెప్పుకొనుచు నేడ్చు
వారు, సంతసించువారు, సంతాపపడువారు, జాలిం జెందువారు,

అనునయించువారు ననేకులుండిరి. ఇట్లొకవారము దినములు గడచిన తర్వాత నెనిమిదవ దివసంబునఁ జెన్నుండు కంటకంబుతోఁ గపిలవస్తునగరంబు బ్రవేశించెను. తత్క్షణంబె జనులు గుంపులు 'గూడి రాకొమరుండేడిరా? ఎందున్నాఁడు? నీ వొంటరిగ నేల నీయశ్వంబును దీసికొని వచ్చుచున్నావు? అతఁడేమాయెరా? నీకేమి దుర్బుద్ధి పుట్టెరా? అతని నెక్కడ డించి వచ్చితివి?' అని అనేక ప్రశ్నము లడుగుచు నతనివెంటఁ బడిరి. చెన్నుండు బొట బొటమని కన్నులగుండ నీరు కారుచుండఁగ నతిఖిన్నుఁడై మోము వంచుకొనినవాఁడై గద్గదస్వరంబుతోఁ జెప్పెను. మాటలు సరిగా రాక 'ఘోరకాంతారంబు సొచ్చె' నని నుడివెను. పౌరులలోఁ, గొందఱు విస్మయము జెందినవారును, కొందఱు వికల హృదయులును మఱికొందఱు నిశ్చేష్టితులునయిరి. కొందఱు రాకొమరునియందు భక్తివిశ్వాసము, ప్రేమ గలిగినవారలు అతండుండు ప్రదేశమే మాకుఁ బట్టణంబు, అక్కడికే పోయెద మనుచు దారి కడ్డమగుచుండిరి. తొల్లి శ్రీరాములవారు పిత్రాజ్ఞా పరిపాలనార్థము కాననంబులకుఁ బోవునపుడు వారిరథంబును వెంబడించిన అయోధ్యానగర పౌరులంబోలి కపిలవస్తుపౌరులును దండోపతండంబులుగా సర్వార్థసిద్ధుండు సొచ్చిన వనవాటికిఁ బోనెంచిరి. మహా కలకలారావంబుతో పౌరజన పరివేష్టుండై వచ్చు చెన్నుని అతని వెంబడినున్న కంటకంబును పురకాంతలు

కొందఱు గవాక్షంబులనుండిచూచి రాచూలి లేకుండుటం గని యా వార్త అక్కడి కామినుల కెల్ల విదితంబుగాఁగ వారలు నిరాశలై విలపింపఁ దొడంగిరి. శుద్ధోదనుండును దేవాలయంబున దీక్షాపరుఁడై జపతపంబు లొనరింపుచు "పుత్త్రాగమనము నిరీక్షించుచు నిట్లనుకొనియెను. మృగయార్థము వెళ్లెననుకొందునా, జంతుహింస స్వప్నమందైన దలంచువాఁడు కాఁడే! పరరాజులను జయింపఁ బోయెననుకొందునా? స్వారాజ్యమునే యపేక్షించువాఁడు కాకపోయెనే! అడవుల కేగెననుకొందునా? దివ్యహర్మ్యములలోని హంసతూలికలమీఁద శయనించువాఁడు ఇన్నిదినంబుల విషమ శిలామయస్థలంబున నివసించునా! తల్లిదండ్రులందు అత్యంత భక్తిగలవాఁడు ఇన్నాళ్లు రాకుండునా! ఏమిగానుండెనో! స్వామీ ననురక్షింపుము." అని బహుభంగులఁ దలఁచుచుండఁగఁ జెన్నుఁడు రాజభవనంబుఁజేరి అశ్వంబును నిజాధిష్ఠానంబునఁ గట్టిపెట్టించెను. పౌరుల కల్లోలంబువిని అంతఃపురకాంత లతిప్రహర్షమ్మునఁ దమ కాంతుఁడు వచ్చెనొకోయని తలంచి మైమరచి ఇలు వెల్వడి వచ్చి రాకుమారుఁడు రానిసంగతి నెఱింగి హృదయములు వ్రక్కలై మోములు పట్టపగలింటి చంద్రులభంగి వెలవెలఁ బాఱి అనంటికంబముల మాడ్కి మూర్ఛంజెంది నేలంబడిరి. వారికిఁ దెల్వి రా నంత వత్సాయనియు నాథాయనియు పెక్కుభంగుల ఱొమ్ముఁ బాదుకొనుచు విలపింపందొడంగి చెన్నునిగాంచి

కుమారునివృత్తాంత మడుగుచుండిరి. యశోధరయుఁ బొరలు పొరలుగాఁబొంగి వచ్చుచుండిన దుఃఖభరంబున తొట్రిలు మాటలతో శరీరమంతయు, గడ గడ వణకుచుండఁగఁ గంటకంబును జూచి 'మైమరచి నిద్రించునడిరేయి సమయంబున మన్నాథుండు నన్విడనాడున ట్లొనర్చి ఆ రాకొమరునియే అడవిపాలొ నొనరించి మీరిద్దఱు గుట్టువచ్చి దొంగయేడ్పు లేడ్చెదరా? విశ్వాసము గలవారని మిమ్ముల సన్మానించితిని. మీ రాజు నెక్కడకుఁ బంపితిరి? నాతోఁ జెప్పఁ దగదా? నేటికి మీ కోరికలు పండినవి గదా? ఇఁక నెందుకు కన్నీరు కార్చుట? ఎంతమోసము సేసితిరి! అకటా! మీరు గోముఖ వ్యాఘ్రములు. వంశమంతరింపఁ జేసితిరి కదా! నాప్రాణ నాథుండు బ్రతికియుండియు యనాథలగతి నిందఱు అల్లో యని వాపోవుటకు మీరే కదా కారకులు. కంటకమా? ఏల సకిలించెదవు. ఇపుడేమి లాభము, ఈ తెలివి ఆ రేయి ఏమయ్యె? నాయకు నెక్కించుకొని పోవువేళ హేషారావ మొనరించిన మేమెవ్వరమైన నిదుర మేల్కొనమా? తెలివి మాలిన పని, సయమునకు లేని తెలివి సర్వానర్థకంబుకాదె?' అని యనేకరీతులఁ బలుకంగఁ జెన్నుండు "తల్లీ! మమ్ముల మన్నింపవలయు, మాకును జరిగిన వృత్తాంతమంతయు స్వప్నంబు వలెనున్నది. దైవమాయ నెవ రెఱుంగఁగలరు? ఒక్కక్షణంబులో జేరిన కాననమునుండి తిరిగి వచ్చుటకు

మాకు నెన్మిది దినంబులయ్యెను. మేము కృతజ్ఞత లేని వారము కాము. మోసముగాని పాపముగాని యొనరింపఁ జాలము. అమ్మా! ఆరాత్రి అదేమిచిత్రమో! కంటకంబు నాయత్తము సేయుమని దేవరపల్కఁగ మాఱుమాట చెప్పలేక మొద్దువలెనుంటిని. ఒకవేళ వలదని నాకుఁ దోఁచినమాటలు మనవిచేసినను వినని యీ రాజతనూజునియాజ్ఞ యుల్లంఘింప నగునా? అంతయు దైవకృతంబు. ఖురధ్వానంబు గాని హేషా స్వనంబుగాని దేవతా ప్రభావమ్మున వినబడ దయ్యె. దేవతలు పారిజాతపుష్ప వర్షంబు గురిపించిరి. మార్గమునం దొక్క యాటంకమైనను లేకుండెను. క్షణంబులో నొక్క మహాటవిం జేరితిమి. అపుడు తన మేననుండిన రత్నహారాది స్వర్ణాలంకారములు దీసి నా చేతికిచ్చి 'గృహస్థాశ్రమంబు వదలితిని. పదిలముగాఁ బొండు' అని చెప్పి అడవిం జొచ్చె. ఇవిగో ఆభూషణంబు"లని వారలకుఁ గనపఱచెను. వారును రాకొమరుఁడు సన్న్యసించెనని దృఢమ్ముగ నమ్మిరి. విధిదప్పింప నేరితరము! పుట్టినదాదిగ స్తన్యమిచ్చి యతి మమకారముతోఁ బెంచిన గౌతమి నానాప్రకారంబులఁ దన తనయునిం దలంచుకొని 'హా! పుత్రా! నీసుకుమార గాత్రము నీకిసలయ సమానపాదంబులు గాఢారణ్య ప్రచారంబునకు సహించునే! ఎంత దురదృష్టవంతులము. నీవంటి రాజు ఎట్టి పుణ్యములొనరించిననో కదా లోకములకు లభించుట. తలిదండ్రుల

కును అత్తమామలకును ప్రియురాలికిని సర్వజనంబునకును మిగుల ననుకూలుఁడవై, ప్రవర్తించి మమ్ముల నందఱను వియోగానలంబున మట మట మండింపఁజేసితివి. అకటా! నీవంశము నీతేజము, నీపరాక్రమము, నీస్ఫురద్రూపము, నీప్రాయము దేనిం దలంచినను నాకడుపు పగులుచున్నది. నీవంటి రాకొమారునికి భిక్షమెత్తి భుజించుట తగునా! ఎండ వాన కన్నెఱుంగక చిత్రాలంకృత హర్మ్యంబులఁ బ్రొద్దు పుచ్చుకొనుచుండిన నీవు శీతవాతాతపంబుల వాత పడుచు ఘోరకష్టంబు లనుభవింపవలసివచ్చెఁగా' అని బహుభంగుల విలపించెను. యశోధరాదేవియు నపరిమిత శోకభరంబున 'అగ్ని సాక్షిగఁ బెండ్లిచేసికొనిన భార్యను విడనాడుట పాడియా! సర్వ కర్మలను భార్యాసమేతుఁడై గృహస్థుండు ఒనరింపవలయు నని శాస్త్రంబు లుద్ఘోషింపుచుండగను, మీ వంశాచారమును బరికించినను-నాథా!-నన్ను విడుచుట న్యాయము కాదు. ధర్మ పత్నిని వదలిన నిష్ఠాతపంబులు దపములగునా! పూర్వము రాజులు అరణ్య వాసము చేయలేదా? వారలు మీవలె ధర్మపత్నులను ద్యజించినారా! సతులతోడ ఘోరారణ్యంబుల సంచరింపలేదా? వారినిష్ఠకు లోపంబుఁ గలిగెనా? ధర్మపరుఁడవు. ధీప్రభా భ్రాజితుఁడవు. శృంగారరస పూర్ణుఁడవు. యుక్తాయుక్త పరిజ్ఞాతవు. సమర్థుఁడవు. అయినను ఇట్లొనరించుటకుఁ గతంబరయగ సురలోక శృంగార మనుభవించుట

కా యనుతలంపు వొడముచున్నది. కాని యీతలంపుఁ బూనఁదగదు. నీకు నాయందుఁగల ప్రేమ, కరుణ ఇంతింతని చెప్పనలవికాదు. ఎన్ని జన్మములనైనను నీ యిల్లాలుగ నుండుటకు నామది కాంక్షించుచున్నది. కాని అన్యభోగంబులెవ్వియు నాకింపుఁ గూర్పఁజాలవు. నీలంపుకురులు, దేదీప్యమాన ముఖంబు, విశాలనయనమ్ములు, మందహాస కందళిత వదనారవిందంబు, శరీర సౌందర్యము, సురుచిరరూపము నా కన్నుల కెల్లప్పుడు గోచరమగుచున్నవి. నాబోటి నిర్భాగ్యురాలికి నీవు దక్కుదువా! నేనీ శోకమును భరింపఁజాలను.' అని భర్తం దలంచుకొని బిట్టురోదనం బొనరించుచు, మూర్ఛిల్లుచు, లేచుచు, దైవమా! కరుణలేదా! అనాథం జేసితివే! అని నిట్టూర్పు విడుచుచు కంటికి నేకధారగా నేడ్చుచుండెను.

శుద్ధోదనుండును జరగిన వృత్తాంతంబంతయు విని మూర్ఛిల్లి తెప్పరిలి దైవకృత్యంబునకు విలపించుచు వంశక్షయంబునకు వందురుచున్నంత నాకాశంబున నొక శబ్దంబు యశోధరా గర్భంబున నొక సుతుండుదయింపఁ గలడను పలుకు జీవితాశం బుట్టింపఁ దత్కాలంబు ప్రతీక్షించుచుఁ గపిలవస్తుపురంబున నుండెను.

గౌతమబుద్ధ చరిత్రము

:o:

చతుర్థాధ్యాయము

గౌతమగోత్రంబున జన్మించినందున సర్వార్థసిద్ధునికి గౌతముఁడనియుఁ బేరుగలిగెను. యశోధరాదేవికి గోపయనియుఁ బేరుగలదు. గోపాదేవి దండపాణి మహారాజు పుత్త్రిక యనియుఁ గొందఱు వ్రాసిరి. గౌతముఁడు కపిలవస్తు నగరమును విడిచి వైశాలికి వెళ్ళి అక్కడ నొక్కబ్రాహ్మణునికి శిష్యుఁడై సకలశాస్త్రంబులం జదివి అందుచేఁ దృప్తుండుగాక రాజగృహంబునకుఁ దరలి అందొక బ్రాహ్మణయతినిఁ జేరి వేదాంతశాస్త్రమును గ్రహించెను గాని అదియు నతనికిఁ దృప్తింగలిగించక పోయెను. అని కొందఱు చరిత్రకారులు వ్రాసియున్నారు. ఎటులైనను గౌతముఁడు రాజగృహ సమీపమందుండిన రత్నగిరియందు ధ్యాననిష్ఠాగరిష్ఠుండై తపంబొనరించుచుండ నతని ప్రభావమ్ము రాజగృహపౌరుల కందఱకుఁ గ్రమక్రమమున విదితం బయ్యెను.

రాజగృహ నగరమం దొక బీదరాలుండెను. ఆమెకొక కుమారుఁ డుండెను. అతం డొకనాఁడు తన్నగరనికటంబుననుం డుపవనంబునకుఁ గ్రీడార్థంబు చెలికాండ్రతోఁ నేగెను. అచ్చట ఇచ్చకు వచ్చిన భంగిఁ గ్రుమ్మరుచుండఁగ నొకసర్పం బతనిం గఱచెను. ఆ కాటుకుఁ గ్రిందపడి అతఁడు ప్రాణములు విడిచెను. స్నేహితులు పట్టణంబున కప్పుడే వెళ్లి యాబీదరాలికీవార్త వినిపించిరి. ఆమె ఘోరున నేడ్వసాగెను. తత్క్షణం బా యుపవనంబునకు రొమ్ము బాదుకొనుచు, నెత్తి మోదుకొనుచుఁ బెద్దపెట్టున రోదనం బొనరించుచు నాతల్లి వెళ్లి కొడుకును జూచి యా మృతకళేబరముమీఁద పడి 'కొడుకా కొడుకా' యని విలపించుచు 'నెన్నో నోములునోచి, దేవతలకు మ్రొక్కుకొని, వ్రతములు సల్పి నిన్నుం గంటిని. నీ కొక కష్టంబైనఁ గలుగనీక నా ప్రాణములతో సమానముగాఁ జూచుకొనుచుంటిని. అయ్యో! యీ పాడుపాము నీకేల దాపరించెనో కదా? నీ ప్రాణమున కిది కాలసర్ప మయ్యెను. తోడి పిల్లలతో సంతోషముగా నీ పూలతోటలో నాడుకొనుచుండఁగ నటా! నిన్నేల కఱచెను? అక్కడకు సర్ప మెందుకు వచ్చెను? వచ్చెనుబో నిన్నే కఱవనేల? కఱచెబో తత్క్షణంబ ప్రాణములు పోవలయునా! అంతయు నా పురాకృతకర్మమె!' అని బిగ్గఱగా విలపించుచుండఁగ జను లనేకులు గుమిగూడిరి. మాంత్రికులును వైద్యులును గూడ వచ్చిరి. పెదవు లాడించుచు నేద్దియో గొణుఁగుచుఁ జేతులతోఁ బైనుంచి క్రిందికిఁ గొందఱు సారించుచుండిరి. పసరులు తీసి

కొందఱు ముక్కురంధ్రములలోఁ బోయుచుండిరి. కండ్లలోఁ గలికములు మఱికొందఱు వేయుచుండిరి. ఔషధములఁ దెచ్చి నోరు పగులఁదెఱచి పోయుచుండినవారు కొందఱును, ఎప్పుడో ప్రాణములు పోయినవి. ఎందుకీ వృథాశ్రమ యనువారు కొందఱును, పెదవులు విఱచువారును, ఆతల్లి దుఃఖమును జూచి కన్నీరు కార్చువారును అనేకు లుండిరి. అందు మఱి కొందఱు 'రత్నగిరి యం దొక మహానుభావుఁడున్నాఁడు. ఆతని ప్రభావము సంస్తవనీయము. అతనిప్రజ్ఞ గణనాతీతము. అతఁడు జితేంద్రియుండు; కరుణైకజీవనుండు; కృపాపరిపూర్ణుండు; ఆయువొసంగ సమర్థుండు; ఆయనదగ్గఱకు నీ మృతపుత్త్రుని గొంపొమ్ము' అని చెప్పఁగ నామె పెనువంతం బొక్కుచు నా శవమును మోయలేక కష్టపడుచు భుజముపై వేసికొని గౌతమునియొద్దకుఁ దీసికొనిపోయెను. అతండును ఆ కేకలు విని పీనుంగును దెచ్చిన యామెం గని 'నీ వెవ్వతెవు? నీ పుత్త్రుని మరణంబునకుఁ గారణం బేమి?' అని యడుగఁగఁ దద్వృత్తాంతం బంతయు విరళంబుగ నుడివి 'నీవు మహాత్ముండవు, నా కొమరుని బ్రతికింపఁగలవాఁడవు, తపస్సంపన్నుఁడవు అని విని యీ మృతకళేబరంబునుఁ దెచ్చితిని. నీవు నా తండ్రివంటివాఁడవు. ఏకపుత్త్రవిషయము. ఎవ్విధంబుగ నైన నా పుత్త్రునికిఁ బ్రాణములు వచ్చున ట్లొనరింపఁ బ్రార్థించెదను. నేను దిక్కుమాలినదానను' అని దురంతచింతాక్రాంత

యగు నా జననిం గాంచి భూతదయోపేతుం డగు నా గౌతముండు 'నీ పుత్త్రునికాయంబు నీకు మాఱుగా నేను కాచుచుండెదను. రాజగృహనగరంబునకుఁ బోయి కొన్ని ఆవాలం దెమ్ము. మీయింటివి పనికిరావు. తల్లి, తండ్రి, భర్త, పుత్త్రుఁడు మొదలగు వారి మరణంబు నెన్నండును నాపన్నులు గాని వారియింటికిం జని భిక్షమెత్తి వానిం దేవలయు. ఒక్కనిమేషంబులో నీ సుతునిం బ్రతికింతును' అని నుడువఁగ నాతల్లికిఁ బట్టరాని యానందంబు జనింపఁగఁ దత్క్షణంబ వేవేగ నాయూరికివెళ్లి యొక్క గృహంబు సొచ్చి ఆయింటియిల్లాలిం గాంచి కలతెఱం గెఱింగింప నామె జననమరణంబులు ప్రాణికోట్లకు స్వాభావికధర్మంబులు. ఎంతయో పుణ్యాత్ములుకదా. అట్టివారలు. మాకట్టి సుఖంబులెక్కడివి. నేఁటికేడాదియైనను గాలేదు. చెట్టంతవానిని దిగమ్రింగి తాయివలె జీవించియున్నాము. అమ్మా! ఆవాల కేమి భాగ్యము కావలసినఁ గొంపొమ్ము అనఁగఁ బ్రక్కయింటికామె ఖిన్నయగుచు వెళ్లెను. ఎన్నిగృహములు తిరిగినను ఆ పట్టణమంతయు గాలించినను ఒక్క యింటియందైనను వలయు నావాల నొసంగువారు గానరైరి. ఎందుబోయినను తల్లిదండ్రులను గోల్పోనివారును బిడ్డలను గంగపాలొనరించి జీవించు నిర్భాగ్యురాండ్రును చిన్నతనమునందె భర్తలను బోఁగొట్టుకొనిన దురదృష్టవంతురాండ్రును అనేకవిధమ్ముల నాపన్నులగు కుటుంబిను లనేకు

లుండిరి. కాని మందున కావాల నిచ్చువారొక్కరైన లేకుండిరి. ఆమెదుఃఖం బపారంబై దుర్భరంబై చేయఁదగినదేమియు లేక గౌతమునికడకుఁ జనుదెంచి జరిగిన వృత్తాంతంబంతయుఁ దెల్పిన నతండు మందస్మితవదనారవిందుం డగుచు నామెతో నిట్లనియె. 'తల్లీ! లోకంబున దుఃఖం బెఱుంగనివారు లేరు. మరణంబు సర్వసామాన్యంబు. ఈ సంగతి నీయంత నీకుఁ దెలియఁగలందులకే యుక్తిం బన్నితిని. ఇట్టి ఘోరశోకంబునకుఁ గారణం బెద్దియో తెలియంగనెంచి ప్రాణములనైనను సమర్పింప సాహసముగలిగి యిటుల సంచరించుచున్నాను. అని తత్త్వ ముపదేశించి ఆమె నూఱడించి పట్టణంబునకుఁ బంపెను. గౌతముఁడును యథాప్రకారంబు తత్పర్వతసానువులందు దాపసియై వసించుచుండఁగ నొక్కనాఁడు పెద్ద మేకల మందను దానివెంటంజను గొల్లవాండ్రనుగాంచెను. అందొక చిన్న మేఁకపిల్ల తనకాలికి ఱాయి తగిలి గాయమగుటం జేసి నడువలేక కుంటుచుండెను. దయామయుండగు గౌతముండు దానిఁ గష్టముం జూచి సహింపలేక ఆ మందకడకు వెళ్లి ఆ చిన్నకూన నెత్తైన తన భుజంబులమీఁద నెక్కించుకొనెను. ఏ కారణంబున నిట్టి మధ్యాహ్నసమయంబున నీ మందను దోలుకొనిపోవుచున్నారని యా గొల్లవాండ్ర నడుగ వారలు మా రాజు యజ్ఞముసేయు చున్నాఁడు. ఆ జన్నములో దేవతలకు బలియిచ్చుటకుగాను మేఁకలం దెమ్మని మా కాజ్ఞ

నొసంగ మేము త్వరితముగ నీమందను దోలుకొని పోవుచున్నారము. వీనిపుణ్యమే పుణ్యము. యజ్ఞపశువులగుట పురాకృతసుకృతంబునం గాదె యని నుడువఁగ నారాజనందనుండరుణాలోచనుండై నేనును మీతోడ ఱేనికడకు వచ్చెద నని చెప్పి ఆ మేఁకపిల్ల నెత్తుకొని గోపకుల వెనువెంటం జనియె. వారలు పురంబుఁ బ్రవేశించిరి. మేఁకలమంద వెంటఁ గొల్లవాండ్రును వారివెంట మేఁకకూన నెత్తుకొని వచ్చు యతీంద్రుండును ఆ యూరివారలకు నాశ్చర్యము కలిగించెను. రాజవీథులందుఁ బౌరులెల్ల గుంపులు గుంపులుగాఁ గూడిరి. వారి వారి పనులన్నిటిని విడిచి యేమో చిత్రమని యమ్మునిం జూడనేగిరి. ఆ తపసిం జూచి ఈమహాత్ముఁడేల గొల్లలతోఁ జేరెనో! చేరెఁబో యీ మందలను గాచుటేల? కాచెఁబో మనంబున గొంచెమైన కించఁ లేక మేఁకపిల్లను భుజములమీఁద నెక్కించుకొని రాజపథంబున నీ విధంబుగ నేలవచ్చెనో కదా అని పరిపరి విధంబులఁ బలుకుచు నచ్చెరువొందుచు నా పౌరులుండిరి. కొందఱు శీఘ్రముగ బింబిసారనరపాలునికడ కేగి యీ విచిత్రమును దెల్పిరి. ఇంతలో నా గౌతముండును యాగశాల ప్రవేశించెను. అందు హోమకుండంబునుండి ఆజ్యహోమంబునఁ బ్రజ్వరిల్లిన అగ్నిజ్వాలలు ఆకాశమునంటుచుండెను. హోమంబు గావింపఁబడుచున్న యాగపశువుల వసాధూమంబు నలుగడల నిండుచుండెను. ఎలుగెత్తి బిగ్గ

రగాఁ బఠింపఁబడుచుండిన మంత్రముల ధ్వానంబున బ్రహ్మాండంబు పగులునట్లుండెను. అంతొక్క ఋత్విక్కు పొడుగు కొమ్ములుగల యొక పశువుతలను యూప స్తంభమునకుఁ గట్టి ఓ దేవతలార! ఓ యహల్యాజారా! యాగపశువు లన్నిటిలో నిది ప్రధానంబు. దీని రక్తమును జూచి హోమంబు సేయఁబడుచుండఁ బక్వమైన దీని మాంసగంధసారంబు ఆఘ్రాణించి ముదం బొందవలయును. బింబిసార భూపాల పాపంబులను దీనిపై వైచితిమిగాన నీ పశువుతోఁగూడ రాజ పాపంబులును అగ్నిహోత్రునిచే దహింపఁబడుఁగాక యను నర్థంబు గల మంత్రరాజమ్ము సుస్వరంబుతోఁ బఠించి ఆ పశువును నఱుకఁబోవు సమయంబున గౌతముండు బింబిసారు చెంత కేగి 'ఈ పశువును నఱుకనీయకుము' అని పెద్ద కేక వేసి యూప స్తంభంబునఁ గట్టఁబడియున్న పశువును బంధంబునుండి విడిపించి సభాసదులందఱు అచ్చెరువొంద చిత్తరువు బొమ్మల వలె నిల్చియుండిన యా ఋత్విజులతో ఉన్న ప్రాణములను బోఁగొట్టుట సులభమే కాని పోయిన ప్రాణములను తిరిగి యిచ్చుట అసాధ్యము. కానఁ బ్రాణులపైఁ బ్రేమలేనివారును ప్రాణరక్షణ మొనరింపఁ బాటుపడనివారును ప్రపంచమునఁ గలరా? ప్రాణిహింసవలనఁ బాపంబు సంభవించును. కాని ఇట్టి కట్టడికృత్యంబునఁ బాపంబులు తొలంగునా? ప్రాణికోటి పరస్పరసంబంధంబు కలది. చేసినకర్మ కొలఁది మాన

వులకు పశుపక్ష్యాది జన్మంబులును, పశుపక్ష్యాదులకు మానవజన్మంబును గలుగుచుండును. ఈ పశువులు మానవులయందు విశ్వాసము కలిగినవై క్షీరంబు లిచ్చుచున్నవి. వీనిపై మనకు దయలేకుండిన మనపై దేవతల కెట్లు కరుణ గలుగును? ఇట్టి దయాశూన్యకృత్యంబుల దేవతలు మెచ్చరు. ఇట్టి దుష్టకార్యంబులు వారి కెంతమాత్రము సంతుష్టిం గావింపవు. ఎవరుచేసినకర్మ వారే యనుభవింపవలసి యుండును గాని ఒకరు చేసినదానిని మఱియొకరిపై వేయ నేరికైన శక్యముకాదు. అనుభవమువలనఁ గాని కర్మ నశింపదు. త్రికరణంబుల నొనరించిన పుణ్యపాపకర్మంబులు శుభాశుభ ఫలంబుల నిచ్చుచుండును. దయ, దాక్షిణ్యము, తెలివి, చాకచక్యము, సన్మానము విడిచి జీవహింసాది దుష్కృత్యముల నొనరించిన దత్ఫలంబంతమందు నిర్భరనిరంతరదుఃఖంబుగాఁ బరిణమించునని యోగ్యములైన మతగ్రంథములు పెద్దపెట్టున నొక్కి వక్కాణించుచున్నవి. జీవహింస చేయఁజనదు. మహాపాపంబు అని పెక్కుభంగుల నుపన్యసించి యందఱ డెందంబులఁ దన మృదుమధురవచనంబు గరుణాబీజంబులం జల్లగ, నవి తత్క్షణంబ యంకురించెను. ఋత్విజులు సిగ్గుం జెంది తలలు వంచిరి. బింబిసారుండును గౌతమునికి సాష్టాంగ దండవత్ప్రణామంబు లాచరించిన నతండు నా రాజమౌళితో నిట్లనియె 'మాంసభక్షణంబు మానవులకుఁ దగదు. మంచి

ధాన్యములు, పక్వమైన ఫలములు, విమలమైన జలము, సర్వ
విధములైన శాకములు మొదలగునాహారంబు దిని శరీరమును
బోషింపవలయును. జీవరాసులయందుఁ బరస్పరమైత్రి ప్రధా
నంబు. కరుణయే అభివృద్ధికి మూలము. ప్రేమయే సృష్టికిఁ
గారణము. హింసయే నాశనమునకు బీజము. ఇదియ తెలి
యందగిన తత్త్వంబు' బింబిసారుండు గౌతముని యుపదేశం
బున నపరిమితానందమగ్నుండై జీవహింస చేయఁగూడ ద
నియు, మాంసభక్షణంబు వర్జింపవలయు ననియు, భూతదయ
ప్రధానమ్మనియు, శిలాఫలకమ్ముల వ్రాయించియు నక్క
డక్కడ స్థాపించియు, జనపదంబులఁ జాటించియు, కృతార్థుం
డయ్యె. అదిమొదలతని రాజ్యంబున జీవహింసాప్రచారంబు
అడుగంటెను.

గౌతమునిఁ జూచి 'ఓయతివరా! నీవు ప్రఖ్యాతరాజ
వంశంబున నుదయించితివి. మహాతేజోవంతుఁడవు. ధృతి
మంతుఁడవు. నీతివంతుఁడవు. ధర్మపరుఁడవు. మహామహి
మానుభావుఁడవు. నీవు రాజ్యంబు పరిత్యజించి బికిర మెత్తి
జీవించుట తగదు. నాకుఁ బుత్త్రులు లేరు. కొమార్తె యొకర్తు
గలదు. దాని నీకిచ్చెదను. నాకుం గల సకలసంపదయు నీ
కిత్తును. నా రాజ్యంబు నీకుఁ గట్టెదను. సుఖంబుగ రాజ్యపా
లనం బొనర్పుము. నాకు ముదంబు గల్పింపు'మని బింబిసా
రుండు పలుకఁగ "రాజేంద్ర! నేను శాక్యవంశంబునఁ బుట్టి

తిని. అతులవిభూతిం గంటిని. సంసారసౌఖ్యం బపరిమితం
బుగ ననుభవించితిని. వాని నన్నింటినిఁ ద్యజించితిని. నిస్సా
రము లని గుర్తెఱింగి సన్యసించినదాని నెల్ల దిరిగి గ్రహింపు
మనినఁ గ్రక్కిన కూటి కాశపడుమనుటయే కదా! విజ్ఞాన
ప్రాప్తికై తపించుచున్న నామనంబు తనయంతఁ దాఁ గామించి
వచ్చిన రంభనైన నొల్లదు. దేవేంద్రపదవి నెత్తికిఁ జుట్టినను
నేనొల్లను. హఠయోగంబునఁ గాయంబును గృశింపఁజేసినను
శాస్త్రములను సాంతముగా నధ్యయనము గావించినను, మూఢ
తాపసజనంబులఁ జేరినను జ్ఞానంబు లభింపదు. ఇది నా నిశ్చ
యము. అట్టి జ్ఞానలబ్ధి మనమున నెంచి గయాప్రాంతమందలి
అరణ్యమునకు నేగి తగు ప్రయత్నం బొనరింతును. జ్ఞాన
ప్రబోధం జెందినపిమ్మట నయ్యది నీకుం దెల్పుదును. లోక
మందు మనుజులు అరిషడ్వర్గంబునకుం జిక్కి మాయావ్యాజ
జీవన తాత్పర్యంబునఁ బ్రవర్తించుటచే దుష్కృతంబులఁ
జేయుచు మోఘప్రయత్నులై, వ్యాధిపీడితులై వ్యర్థ
సంకల్పులై విమలజ్ఞానసంపత్తిని బొందలేక వమ్ముం జెందు
చున్నారు. సంతతానర్థదాయకము లైన కార్యములు వర్జ
నీయములు. నాకు సుఖదుఃఖములు సమానములు గాన
రాజ్య మేలుటయు భిక్షమెత్తుటయు నొక్కటిగా నున్నది.
రాజ్యపాలనసుఖంబును భిక్షాటనదుఃఖంబును నిత్యములు
కావు. సర్వసంగపరిత్యాగులు సమలోష్టహేములు, కావున

నన్ను తృతీయపురుషార్థమునకై పురికొల్పక విజ్ఞానమార్గాను సంధానంబునకై హెచ్చరింపుము. ఆదయ నాయందు నీకు గల మైత్రికిఁ దగిన ఫలంబు" అని గౌతముఁడు చెప్పి విజ్ఞానాభిలాషియై గయాప్రాంతమునకుఁ దరలెను.

గౌతముఁడు అరాడ మునీంద్రుని యాశ్రమంబు చేరఁగ నా తాపసి అధికభక్తితో నెదురేగి అతనిం దోడ్కొనివచ్చి ఉచిత అతిథి సత్కారంబు లొనరించి "నాయనా! సంకెల లూడ్చుకొన్న మదపుటేనుఁగు భంగి సంసారపాశంబును ద్రెంపుకొని రాచఠీవిం ద్యజించి భిక్షుకుఁడ వైతి వని వింటిని. సుఖము లనుభవించి బిడ్డలంగని కోరికలం దిగఁద్రావి రాజ్యము కొడుకుల కప్పగించి ముదుసలులై యడవులఁ జేరిరి. కాని తారుణ్యమునందె నీవలె సర్వస్వమును సన్న్యసించిన వార లెక్కడనైనఁ గలరా? నీ మంత్రులును బౌరోహితులును నేఁటికి మూఁడు దినంబుల క్రిందట నిన్ను వెదకికొనుచు నిక్కడికివచ్చి వెళ్లిరి. నినుఁగూర్చి నీ బంధువులు అలో యని యేడ్చుచున్నారఁట. నీ చేయఁగల ముక్తిమార్గోపాయం బేమిటికి! ఎంత వెఱ్ఱివాఁడవు. చిరకాలము నుండి మునివృత్తిం జెలంగుచుఁ దప మాచరించుచున్న మాబోంట్లకుఁ గించిత్తైన నెఱుకపడ లేదు. ఇఁక నీవా నిర్వాణపదవిం జెందుట?" అని పలుకఁగ విని గౌతముండు 'ఇట్లుపదేశించుట ధర్మంబు గాదు. జరామరణగ్రస్తంబగు మానవలోకము నుద్ధరింప మీవంటి

మహనీయులు తలంపవలయును గాని విజ్ఞానార్థినై వచ్చిన సన్న్యాసి నగు నన్ను నిరాకరించుట న్యాయమా? ప్రవాహంబునఁబడి దరిగానక తద్వేగంబున కెదు రీఁదుచుండిన వానికిఁ జేయూత నిచ్చి రక్షింప సమర్థులైన మీ కడకు జరామరణరోగభయంబు పాయు గతి నెఱుంగ వచ్చితిని. కటాక్షించి నీ యుపదేశంబునకు నన్నర్హునిగా నెంచి తత్త్వంబు తెలియం బల్కుము.' అని యా మునీంద్రుని పలు తెఱంగుల వేఁడుకొనఁగ నమ్మునీంద్రుఁడు కపిలమతము, బ్రహ్మమతము, శ్రుతిమతము, విశదీకరించి, తత్త్వము నుపదేశించెను.

గౌతముం డరాడ మునీంద్రుని యుపదేశంబున నిజ సంశయవిచ్ఛేదనంబుఁ గాంచక అతృప్తుం డయ్యెను. అంత నతండు గయాప్రాంతముల కరుగుదెంచెను. నిరంజననదీతీరంబునఁ గొన్నాళ్లుండెను.

ఫల్గునీ నదీ తీరంబున 'మోహాన' 'ఇలాజని' అను నదులు రెండు గలయు స్థలంబు కలదు. సేనాని యను పేరఁ బరఁగు జనపదంబొకం డట కలదు. దాని సమీపంబున, నురువలయమ్మను నొక కంటకారణ్యంబు గలదు. అందుఁ గొండలవలెనుండు ఇసుకదిబ్బలు కలవు. ముండ్ల పొదలును లతలును గలిగి మిన్నంటుచుండు తరుషండంబులు గలవు. నదీ ప్రవాహంబులందు నీరుం ద్రావి నానావిధప్రసూన పరిమళంబును జూరఁగొని మెల్లమెల్లన వచ్చుచుండిన మంద

మారుతంబు తరుచ్ఛాయలను శీతలితములుగఁ జేయుచుండెను. ఆస్థలంబు నిరామయమై, మనోహరమై, నిశ్శబ్దమై, నిర్జనంబై, ధ్యానయోగ్యమై పరగుచుండెను. చనిచని గౌతముం డీ ప్రదేశమును జేరి స్వర్గమరణ సుఖదుఃఖ రహస్యముల గుఱించి, ప్రపంచవేద్యమగు నీతినిగుఱించి, ఇంద్రచాపమును బోలి క్షణభంగురమైన జీవతత్త్వమును గుఱించి యోజింపఁ బ్రారంభించెను. ఒంటిపాటున నుండి ధ్యానసమాధిం జెంది ఉదయాస్తమయముల నైన నెఱుఁగక ధ్యానించుచుండెను. రుచిరపల్లవపక్వఫలఖాదియై శరీరమునుఁ బోషించుచుండెను. మాసముల పైన మాసములు గడచెను. కాలము గడచిన కొలఁది యాహారమునుగూడ వర్జించి యతండు నిరంతరధ్యాననిష్ఠం జెంది సతతము మైమఱచి జిజ్ఞాసాపరవశ చిత్తుండై యుండుటం జేసి కాయము కృశింపఁదొడంగెను. నిరాహారుండై యుండు కతంబున నొక్కనాఁ డతఁడు స్మృతిఁ దప్పి మూర్ఛ బొంది పడియుండఁగ దైవవశంబున నక్కడికి వచ్చిన ఒక గొల్లపిల్లవాఁ డతనిం జూచి అయ్యోపాప మీ బాపఁడు వడఁ దాకి సొరఁబోయి తెలివిఁ దప్పి పడియున్నాఁడు. అని మనంబున నెంచి అక్కడి నేరేడుకొమ్మల నఱికి అతనికి నాలుగు వైపులను నాటి పందిలిగా నిర్మించి సూర్యరశ్మి తగులకుండఁ జేసి తాను గాయుచుండిన మేఁకలలోఁ బాలిచ్చు మేక నొక దానిని దోలికొనిపోయి గౌతమునినోటిలో నాపాలను బిండెను.

అందుఁ గొంత లోనికిఁ బోఁగా తెలివొంది కన్నులు తెఱచి చూచి దగ్గరనుండిన గొల్లపిల్లఁడిని వాని పిడతలోఁ బాలను బితికి తనకియ్యుడని యడిగెను. "అయ్యా! నేను దాకినపాలను నీవు గొనఁదగదు. నాతల్లి నన్ను మేకలనుగాయుట కీయడవికిఁ బంపునపుడు 'ఓరీ బ్రాహ్మణు లెవరైనఁ బాల నడిగిన వారికిఁ దనివిదీర నిమ్ము. కాని యాపాలను నీవు తాకకుము' అని నాతోఁ జెప్పెను. అందువలన నీకుఁ గావలయుపాల నీ దుత్తలోనికిఁ బిండెదను. ఆదుత్తను నీవు పట్టుకొనుము." అని చెప్పఁగ "వెఱ్ఱివాఁడా! నిన్నుఁగోసిన నెత్తురును నన్నుగోసిన పాలును వచ్చునా? నాతల్లిదండ్రులు నన్నుగనినట్లు నీ తల్లిదండ్రులు నిన్ను గనలేదా? నీకంట నుప్పునీరును నాకంటఁ జప్పునీరును గలదా? మొగమున బొట్టు భుజమున జందెము మేము పుట్టినపుడే మాకుఁ గలిగెనా? ఇవన్నియు మానవకల్పితములు. భూతదయ కలిగి సుకృతము లొనర్చువాఁడు ద్విజుండు, దుష్కృతంబు లొనర్చువాఁడు చండాలుండు. ఇంతియఁగాక వర్ణభేదమ్ము వేఱులేద"ని తెలియంజెప్పి ఆగొల్లపిల్లనిచే నివ్వఁబడిన దుగ్ధమ్ములు గ్రోలి యాస్థానంబు విడనాడి మఱియొక స్థలంబున నొక తరుచ్ఛాయం జేరి 'శరీరము గడుంగడు గృశించుటచేఁ దత్వచింత తోఁచుటలేదు. నిరాహారుండ నగుటచే స్మృతి తప్పుచున్నది. శరీరము బాగుండినంగదా మనంబు బాగుండుట. కాయము నింతఁ గృశింపఁ

చేయుట తప్పు' అని చింతించి లేచి కొంతదూరము సేనానిగ్రామాభిముఖుంబుగఁ జనెను. అక్కడా యరణ్యమం దొక దేవాలయంబు గన్పడెను. గౌతముం డా యాలయముఁ బ్రవేశించెను. అయ్యాదా వన దేవతగుడి. ఆదేవతకు సేనానిపల్లె నుండువారలు మ్రొక్కులు మ్రొక్కుకొనుచుందురు. ఆపల్లెయందు సేనానియను పేరుగల ధనికుఁ డొకఁ డుండెను. అతనికిఁ బసువు లనేకము లుండెను. అతఁడు ధర్మతత్పరుఁడు, నీతిపరుఁడు, నైష్ఠికుఁడు, దయాపరుండు. అతనికి సుజాతయను నొక భార్యకలదు. ఆమె సత్యవాక్సంపన్నురాలు. మృదుభాషిణి, సాధ్వియు నగును. వారిద్దఱకు నన్యోన్యమైత్రి కలిఁగి దాంపత్యము చక్కఁగనుండెను; గాని బిడ్డలులేరను గొదవ మాత్రము వారిరువురిని మిగుల వగలం బొగలఁజేయుచుండెను. ఇది యొక్కటి తప్ప వేఱొక్కదుఃఖంబు వార లెఱుంగరు. ఎన్నియో నోములు వ్రతములు సమారాధనలు అశ్వత్థప్రదక్షిణములు ఒనరించిరి కాని వ్యర్థంబులయ్యెను. చివఱకుఁ బల్లెవార లందఱు వనదేవత నారాధించిన నిజంబుగ గర్భంబు గలుగునని నొక్కిపల్కఁగ దాని క్రమంబడిగి తెలిసికొని ప్రతి పౌర్ణమినాఁడును వెన్నెలలో నా సుజాత అధిక భక్తితో పుత్త్రోదయవాంఛ ప్రబలమగుడు ఆవనదేవత గుడికి నెనుబదియొక్క ప్రాకార ప్రదక్షిణములు గావించి, ధ్యానించి, షోడశోపచారంబుల నొనరించి పక్వఫలములు

నానావిధ శాకాపూప సమేత శాల్యన్నంబు నైవేద్యము సమర్పించి సేవయొనరించి 'అమ్మా! నాకొక కొడుకేని గల్గిన నీకు రుచిగల భోజ్యమ్ము లనేకమ్ములు బంగరు పళ్లెరములలో దెచ్చి పెట్టెద'నని మ్రొక్కుకొనెను. అంత నా సుజాత దైవవశంబున గర్భవతి యయ్యెను. కుమారు నొక్కనిం గనెను. సేనాని జనులందఱును అపరిమితానంద మగ్నులయిరి. సేనానియు నమందానందముం జెందెను. యోగ్యులగు బ్రాహ్మణులకు దశవిధదానముల నిచ్చెను. శతగోదానంబుల నొనర్చెను. నాలుగు వర్ణముల వారికిని అన్నదాన మొసంగెను. పలు వేడుకలు జరపించెను. పుత్త్రుఁడును మూడునెలలవాఁ డయ్యెను. అంత సుజాత తాను మ్రొక్కుకొనిన దేవత మ్రొక్కుఁ దీర్పందలచి వివిధపదార్థములను సిద్ధపఱచి భోజ్యములను బసిండి పళ్లెరంబున నుంచి యొక చేత బిడ్డ నెత్తికొని వనదేవతా ప్రీతికరంబుగ నా పళ్లెరమును శిరముమీఁద నిడుకొని తద్దేవతాలయమునకుం జనెను. ఆసమయమునకు సరిగా సర్వార్థసిద్ధుండు ఆదేవతకు ముందరఁ బద్మాసనాసీనుఁడై యుండెను. ఆ దివ్యమంగళ విగ్రహముం గాంచి 'ఏమి మన పుణ్యము! వనదేవత నేఁడు సాక్షాత్కరించెను. ఏమి సౌందర్యము! ఏమి వర్చస్సు! ఎంత తేజము! ఆహా!' అనిదేవతా భ్రాంతిం జేసి తాఁ దెచ్చినపదార్థము లతని ముంగలనుంచి, నమస్కరించి 'తల్లీ! నీవునాకు మహోపకారము చేసి

తివి. నీదయవలన నాకీ సుతుం డుదయించెను. నేఁ జెప్పిన రీతి నీకుఁ బాయసాన్నము భక్ష్యభోజ్యములును దెచ్చితిని. దయతోఁ గైకొనుము' అని ప్రార్థించిన నంత నాకలి గొనియున్న సిద్ధార్థుండు మాఱాడక యవి యన్నియు భుజించి 'నీమ్రొక్కు యథోక్తముగఁ జెల్లె'ననుచు నాశిశువు శరీరము నిమురుచు 'చిరంజీవ,' 'సుఖీభవ,' యనుచు దీవించి సుజాతతో 'తల్లీ! నేను వనదేతను గాను. నేను గపిలవస్తు పురాధీశుం డగు శుద్ధోధనుని కొమరుఁడను' అని తనవృత్తాంతం బంతయుఁ దెలిపి అనేక గోవుల క్షీరంబులు గలియుటం జేసి యీపదార్థంబు బహు రుచ్యంబై పరిణమించిన భంగి యనేకజన్మంబు లెత్తినపిదప జీవుఁడు ముక్తుఁడగును గాని 'ఇట్లూరక జన్మంబు లెత్తుచున్నంతన జన్మసాఫల్యంబు గలుగునో లేక జీవించియుండియు భూతదయమున్నగు ధర్మంబులు కలిగియున్నం జాలునో' యనియు నీవలనం దేటపడవలసిన యంశంబు లియ్యవి' అని యడుగ సుజాత 'నేను మూఢురాలను నీకుఁ దెలియంబలుకఁ గలదాననుగాను. నా యెఱింగిన తెఱంగు వినిపించెదను. ఏవిత్తనము నాటిన నావృక్షమే యుద్భవిల్లును; గాన నసూయాదయలవలన నసూయాదయలే ఉదయించుచుండును. పుణ్యాపాపము లెవరొనరించిననవి వారికి ననుభవనీయములు. అవియూరకపోవు. ఒక్కవిత్తు నాటిన నది నాశనంబొందియు ననేక విత్తులు గలుగుటకుం గారణా-

వటుల నీజన్మంబు నశించియు ననేక జన్మంబులకుం గారణంబుగాఁ గలదు. జీవించియున్న కొలఁది దుర్భరంబులగు కష్టపరంపరలు తండోపతండంబులుగా వచ్చుచుండెడిని. నేను ప్రతిదినంబును నిద్రలేచి భగవంతుని స్మరించి నా భర్తకు శుశ్రూష సలుపుచు కాలంబు గడపుచున్నాను. నా భర్త మరణించిన నేను సహగమనంబుసేసి యతనికి నుత్తమగతి కల్పించెదను. అటులఁగాక మా కన్నమున్న ఈ పాపఁడు బొందివిడిచిన మాదుఃఖమునకుఁ బరిమితికలదా? కాన నేఁ జావునకు వెఱచుదాననుగాను. ప్రతిక్షణంబును మరణంబునకు సంసిద్ధురాలనుగ నున్నాను. నా చిత్తంబు కరుణాయత్తంబు. నేనొరులు కష్టపడుచుండఁగఁజూచి సహింపఁజాలను. నేనపకృతి కలనైన నెఱుంగను. ఉపకృతి శక్తివంచనలేక సల్పుచున్నాను. ధర్మకార్యము లెన్నియో యొనరించితిని గాన నాకు సంభవించున దంతయు ననుకూలముగనె పరిణమించుచున్నది." అని నుడువఁగ గౌతముండు ఆమహాపతివ్రతకు నమస్కరించి దీవనలందుకొని ఆ యమ్మను వీడ్కొల్పితనంతఁ దాఁ జనిచని ఊడ లనేకములుగఁ గలిగి సూర్యరశ్మి కన్నుల కగపడ నీకుండునంత దట్టముగా నిండియున్న పత్రవ్యాప్తి కలిగి అంతరాయములేక నీడ నిచ్చునట్టి మఱ్ఱిచెట్లుగల ప్రదేశంబున నానా ప్రసూనసమేతలతావితానంబులచే స్వభావముగ నిర్మింపఁబడిన లతాగృహంబొందు గన్పడఁగ దానిం

జొచ్చెను. చొచ్చినతోడనె పుష్పములన్నియు నతనిమీఁద జలజల రాలెను. ఆ కాననంబుననుండు మృగంబులన్నియు నన్యోన్య స్వాభావిక విరోధముల మాని యత్యంత మైత్రిని బూని గౌతమునికి సేవఁజేయఁ దొడంగెను. శుద్ధ సత్త్వమయుండగు సిద్ధార్థునికి నరిషడ్వర్గంబును అహంకారమ్మను మాయయు, స్వాధీనము లగుటంజేసి యతండు నిర్వికారుఁడై నిశ్చలచిత్తుండై, పవిత్ర హృదయుండై యుండె. చీఁకటినిబోలి యావరించెడు మాయ కతని విజ్ఞానంబు సూర్యరశ్మియయ్యె. పెనుగొండవలెఁ బెరుఁగు నహంకారమున కతనిబుద్ధి వజ్ర కులిశంబయ్యె. గాఢ మేఘంబు భంగిఁ గదియు గర్వంబున కతని వివేకంబు ఝంఝామారుతంబయ్యె. సకల వికార ప్రచండానిల ప్రకంపనంబున కతని మనంబు మహాపర్వత సన్నిభంబయ్యె. సర్వ వికారములకు మూలంబైన వాంఛను నిర్మూలంబుగావించినవాఁ డగుటంజేసి సర్వము నెఱింగినవాఁడై, ధైర్యము, మహాత్వము, జ్ఞానము, వైరాగ్యము గలిగి తపంబున లోకమును జయించిన సర్వార్థసిద్ధునకు భగవదనుగ్రహంబున దివ్యదృష్టియు, దివ్యశ్రోత్రము, పూర్వజన్మశ్రుతియుఁ, బరచిత్త విజ్ఞానంబును, నప్రత్యక్ష విషయజ్ఞానంబును, వియద్గమనాది లాఘవంబును గలిగెను. ఆ కారణంబున నిజతత్త్వం బా మహాత్మునికి విదితంబయ్యె. అనిర్వాచ్యంబును నానందమయంబును బాపరహితంబును నిర్వికారంబునగు

నిర్వాణపదవి అధిష్ఠించిన యయ్యనఘుఁడు బోధిసత్త్వ సంపన్నుండయ్యెను. అప్పు డరుణోదయమయ్యెను. అన్ని దిశల నీరెండ ప్రబలమయ్యె. పచ్చికమీఁదను బల్లవములమీఁద నుండిన హిమబిందువులు వజ్రతుల్యంబులై వెలుంగఁజొచ్చెను. ఆకాశ మెఱ్ఱవడియె. మేఘపంక్తులకుఁ గెంజాయకలిగెను. నానావృక్ష పత్రంబులు తళతళమను సొబగు వహించెను. కలకంఠశారికా కలరవంబు సూర్యభగవానునిఁ గూర్చి నుతిసల్పువిధంబుగ నుండెను. గౌతమునికి జ్ఞానోదయంబైన కతంబున నెల్లరకు చిత్తవికాసంబు గలిగెను. అమరవరులు తమ కార్యము నెఱవేరెనని సంతసించి సిద్ధార్థుపై మందారాది దేవప్రసూనములను వర్షించిరి. సర్వార్థ సిద్ధుండును బుద్ధుండయ్యె. ఆవటవృక్షంబు క్రిందన ఇరువదియొక్క దినంబులుండెను. వికసించిన పుష్పములయొక్క పరిమళము గాలిచేఁ గడుదూరంబునకుఁ గొంపోఁబడి యనేకులకు విదిత మగు పగిది బుద్ధుని జ్ఞానోదయంబు నలుగెడల విదితంబయ్యె. తన్నుఁ జేరినవారల కందఱకును నిర్వాణ సాక్షాత్కారంబు నుడివెను. ప్రపంచమునకంతయు మేలొనరింప నెంచిన బుద్ధుండా ప్రదేశంబువదలి తాఁబోవు మార్గమందలి పట్టణములలోను పల్లెలలోను, అడవులలోను పర్వత ప్రాంతములందును నివసించువారల కెల్ల బోధిసత్త్వం బుపదేశించుచుండ వేలకొలఁది జను లా మహామహునకు శిష్యులైరి.

గౌతమబుద్ధచరిత్రము

పంచమాధ్యాయము

కపిలవస్తునగరంబున శుద్ధోదనుండు నానాదేశంబులకుఁ జారులం బనిచియు, బైరాగులం బరీక్షించుచు నెన్నియో మార్గము లవలంబించినను సుతునివార్తయే తెలియరాకుండెను. అందుచే నతఁడు మిగుల వందురుచుండెను. రాహులుండు శుక్లపక్షచంద్రుని చందంబున నభివృద్ధిం జెందుచుండెను. అతని యద్దులు ముద్దులు, ఆటలు పాటలు శుద్ధోదనుని దుఃఖమును అనునయింపఁజేసెను. పతివ్రతాతిలకంబగు యశోధరాదేవియు సారెసారెకుఁ బతివియోగంబునకు విలపించుచు 'నాథా! ఎంతదూరమున నున్నావో! నీ చిన్ని కుమారు నైనఁ జూచు నదృష్టము నోఁచవైతివి. అకటా! కట్టఁడి విధాత కెంత బరువైతివి! బ్రతికియుంటివో లేక మృతుఁడవైతివో నీ సంగతి యొక్కింతయుఁ దెలియదాయె! నిన్ను విడిచి నే నెంతకాలము జీవింపఁగలను? మీ తల్లి యెంత పుణ్యవతియో కదా! ఇట్టి కష్టము ననుభవింపక ముందే స్వర్గమున కేఁగెను. ఆహా! నే నీ దురంత దుఃఖా

నలంబు సైఁపఁజాల.' అని చెంతనుండు పూఁదోట కరుదెంచి యక్కడి శృంగారంబు దుఃఖం బతిశయింపఁ జేయఁ దనలోఁ దా నిట్లనుకొనియెను. "శాక్యమహారాజు ఉత్సవంబని పాటించిన మాతండ్రి నన్నేల పంపవలయు? పంపెబో మా యిద్దఱకే, మనంబులు గలియుటేల? కలిసెబో నన్నింతేని గారవమ్మునఁ జూచుటేల? తుద కిట్లు నన్విడనాడి తా నడవుల పాలగుటకే కాఁబోలు. అకటా! ఈ లతాకుంజములం గనిన నా మనం బవియుచున్నది. ఎంత దుర్యోగము సంఘటిల్లెను. పూర్వ మొనర్చిన కర్మ అనుభవించినం గాని తఱుగదు కదా?" ఆడుకొనుచుండిన తన పుత్త్రునిం జూచి 'నీ వెట్టి దుర్ముహూర్తంబున నా కడుపునఁ బడితివో నాఁటి రాత్రియే నీ తండ్రిని సన్న్యాసిం జేసితివి. అనేక కష్టముల పాలొనరించితివి. నీ వెక్కడి కొడుకవు. జనకుని సుఖపెట్టువాఁడు కదా తనయుండు?' అని తనుగూర్చి నిష్ఠురోక్తులు పలుకుచుండిన తల్లికిఁ బూలం దెచ్చియిచ్చుచు ముసుముకుచు, నవ్వుచు బాల్యచేష్టలం జేయుచుండిన రాహులున కేమియుఁ దెలియకుండెను. అంత నక్కడి సరోవరంబులో నీఁదుచుండిన హంసలను గాంచి "ఓ హంసవతంసములారా! మీరు ప్రపంచ మంతయు గ్రుమ్మరుచుందురు. మీకు రాకొమరుని జాడ లెందైన నెఱుంగవచ్చు. సమయము గనిపెట్టి 'కుమారుఁ డేడేండ్ల వయస్సువాఁడు. అతి మనోహరుఁడు.

నిన్జూడఁ గోరుచున్నాఁడు. నీ సతి యశోధరాదేవియుఁ జావ లేక ప్రాణావశేషితమై కోర్కులు మిన్నుముట్టఁగ మిన్న మన్నెక్కనియతిగా నలందురుచున్నది' అని చెప్పి త్వరితముగఁ బంపం దగు"నని యశోధరపల్కి దుఃఖావేశంబున బొగలుచుండినంత నెచ్చెలులు వచ్చి 'హస్తినాపురంబునుండి యిద్దఱు వర్తకులువచ్చి మనకోట దక్షిణద్వారంబున విడిసి యున్నవారలు. త్రిపుషుఁడు భల్లూకుఁడు అను నామంబులు కలిగి సరిగంచువల్వలు, కత్తులు, బిత్తలపాత్రములును, దంతపు పనిముట్లును, సుగంధద్రవ్యములును జిత్రవిచిత్రమ్ములగు పక్షులును నమ్మఁదెచ్చిరి. వారు మనరాసుతునిఁ గాంచిరఁట. నమస్కృతు లొనరించిరఁట. అఖండజ్ఞానసంపన్నుండై అందఱకు జ్ఞానబోధగావించుచు లోకోపకృతికిఁ జరియించుచున్నవాఁడఁట. ఇంతియకాక యతఁడిచ్చటికి శీఘ్రముగ నరుదెంచునఁట. నిజమెంతో యోజింపవలసియున్నది' అని నుడువఁగ యశోధర పరమానందభరితమై ఆ వర్తకులం దనయొద్దకుఁ దోడ్కొని రమ్మని నెచ్చెలులకు నియమించెను. వారును త్వరితంబుగ నేగి యాసార్థవాహుల రావించిన వారితో యశోధరాదేవి 'పుణ్యాత్ములారా! ఈ రాజనందనుండు లోకమున కుపకార మొనరింపుచుఁ బ్రపంచమంతయుఁ దన యిల్లుగాఁ దిరుగుచు జ్ఞానబోధగావింపుచు నీ నగరమునకుఁ గూడ వచ్చునంచు మీరలు చెప్పిరఁట. ఇయ్యది వాస్తవంబా?'

యనంగఁ ద్రిపుషుండు 'తల్లీ! మగధదేశంబున ఫల్గునీ నది యొడ్డున గయకుసమీపంబున నొక్క వటవృక్షంబు బోధి యనుపేరఁ బరఁగుచుండు. ఆ తరుచ్ఛాయయం దాసీనుండై ధ్యానపరుఁడై యుండ నీ నృపనందనుండు బుద్ధత్వంబుఁ జెందెను. అది మొదలా యనఘాత్ముండు లోకమునకంతయు గురుండయ్యె. మేము నా మహాత్ముని సేవించితిమి. వారి పాదద్వంద్వమునకు భక్తితో మ్రొక్కితిమి. ఆ మహానుభావుం డెల్లరకు నిర్వాణమార్గంబు నుపదేశించుచు నున్నవాఁడు. ఇంత యేల మహోన్నతానందపదవియం దున్నవాఁడు. ఇటకుఁ గొలఁది కాలంబులోనే వచ్చును. ఇది సత్యంబ.' అని పలుకఁగ యశోధరాదేవి పరమానందపరీతయై 'ఓయనఘులారా! నృపనందనుండు బుద్ధుం డయ్యెనని వచించితిరి. ఆ సంగతి మీ కెట్లు ఎఱుంగఁబడియె' ననఁగ భల్లూకుండు "అట్టి సమయంబున భూకంపంబుగలిగె; ప్రచండానిలంబు విసరఁజొచ్చె. నదులందుఁ బెన్వఱదలువచ్చె. ఈ రాసుతునకు జ్ఞాన మబ్బెనని మాకు వినంబడియె; దానఁజేసి మే మచ్చోటి కరిగితిమి. ఆ మఱ్ఱిచెట్టుక్రింద సమాధి నిశ్చలుఁడగు నా మహామహునిఁ గంటిమి. మఱునాఁడుదయంబున సూర్యుండుఁ బూర్వమ్ము కంటె శతగుణమ్మగు తేజమ్మున నుదయించె. సమస్తజనుల హృదయమ్ములు ఆనందపరవశములయ్యె. ఆకాశవాణియు, 'ఓ బుద్ధా! నీ తెలిసిన విజ్ఞానంబు జగంబున కుపదేశించి యందఱం

కృతార్థులఁ జేయుమ'ని పల్కెను. బుద్ధుండంతఁ గాశీనగరం
బునకుం దరలెను. అక్కడ మహోపన్యాసం బొక్కటి యొన
రించెను. రాగద్వేషాదులంజయించి అహింసయు భూతదయ
యుఁ గల వారలు నిర్వాణపదవి కధికారులగుదురనియు, సర్వ
మ్మునకుఁ బురాకృతంబగు సుకృత దుష్కృత రూపధర్మంబు
గాని వేఱొండు దైవమ్ము లేదనియు, నరకంబన వారు వారొ
నర్చికొనెడి బాధయేయని యుపన్యసించి జనన మరణమ్ములు
నశింపఁజేయు నుపాయమ్ము నుపదేశించెను. అయ్యెడఁ
గౌండిన్య, భద్రక, అశ్వజిత్, బసవ, మహానామ లను నైదు
గురు శిష్యులైరి. అందుఁ బ్రథముండు త్వరితంబుగఁ దత్త్వం
బును గ్రహించి ప్రజలకందఱకు నుపదేశం బొనర్ప నెంచి దేశ
సంచారమ్మునకు వెడలెను. మిగిలినవారును గొంతకాల
మునకు విజ్ఞాన ప్రాప్తిం జెంది లోకోపకృతికై వివిధదేశమ్ముల
కరిగిరి. అంత యశోద నరపాలుండును దన భృత్యులతో
బుద్ధుని కడ కేతెంచి యుపదేశంబువడసి విజ్ఞానియయ్యె. జ్ఞాన
లబ్ధిం జెందిన వారలందఱును నానాదేశంబుల కేగి బుద్ధుని
మతంబు ప్రసరింపఁజేయుచున్నారు. మేమును కొంతదూర
మామహాత్ముని వెంటంజని తదుపదేశంబు గ్రహింపఁజాలక
మా కది ప్రాప్తంబు లేదని చింతించి పూర్వము భంగి వర్త
కులమై యిచ్చటికివచ్చితిమి. బుద్ధుండు రాజగృహ నగరమున
కేగెను. అందు రాజ మౌళియగు బింబిసారునికిఁ దనమతం

బుపదేశించి, యతనికి జ్ఞానబోధగావించి, అతనినిఁ దత్త్వపారం
గునిగ నొనరించెను. అతండును కృతజ్ఞతా పూర్వకంబుగ
తన్నగర నికటస్థంబగు వేణువనంబు బుద్ధునికి దానమొనరించి
అందొక విశాలమగు శిలాఫలకంబు స్థాపించి అందు జనన మర
ణంబులకుఁ గారణంబును సంసృతి దుఃఖం బున్మూలించు
మార్గంబును దనకుఁ బుద్ధుఁడు దెల్పెనని వ్రాయించెను. ఆ
వనంబున నొక్కనాఁడు బుద్ధుండు అతి మనోహరంబగు వార్ధా
టితో మనంబున నాటునటులఁ దత్త్వజ్ఞానమునుగుఱించి
యొక్క మహోపన్యాసముంగావించె. ఆనాఁడనేకులా సభకు
వచ్చియుండిరి. అందు రమారమి సహస జనులుండిరి. వా
రందఱును దత్క్షణంబ సన్న్యాసులై తత్త్వమును గ్రహించి,
విజ్ఞానులై బుద్ధునివలె లోకోపకార మొనరింపనెంచి అతని
యాజ్ఞం గైకొని నానాదేశమ్ములకు వెడలిరి. సత్కర్మాచరణం బే
ముక్తికిమార్గంబు. దుష్కృతు లేనాఁటికిని మోక్షప్రాప్తిం జెంద
నేరరు. సదాచారసంపన్నులై జితేంద్రియులై వర్తించువార
లకు మోక్షంబు కరతలామలకంబు. అందఱును భూతదయ
కలిగి అహింస ననుష్ఠించుచుండవలయు నని బుద్ధుని మతంబు.
నేఁటివఱకును బుద్ధుండు రాజగృహమందే యున్నవాఁడు.
ఇక్కడికా నగరం బఱువదియోజనంబుల దూరంబుననుండు.
మార్గంబున శోణానదియుఁ బర్వతంబులును గలవు." అని నుడివి
యశోధరాదేవికి నధిక ప్రీతిం గొల్పి వా రిరువురు నామె

యనుజ్ఞ వడిసి వెళ్లిరి. ఈ వృత్తాంత మంతయు శుద్ధోదనుం డును సవిస్తరంబుగ విని తనసుతున కొకవార్తం బంపెను. యశోధరయు నొకజాబు వ్రాసి మనోవేగంబునం బోవు నాశ్వికులం బిలిపించి వారిచేతి కిచ్చి పంపించెను. వీ రంద ఱును శీఘ్రంబుగ రాజగృహనగరమునకు వెళ్లి శిష్య సహా స్రమునకు అమృతవాగ్ఝరీ ప్రభావంబునం దత్త్వం బుప దేశించుచుండిన బుద్ధునిం గాంచి మైమఱచి ఇది వృష్టి సమయం బిది రాత్రిసమయం బని యెఱుంగక ప్రసూనగత మరందాభిలాషమునం జిక్కిన తేనెటీఁగల చందంబునం దదే కాయత్తచిత్తంబునం బొదలుచుం దదంతేవాసి గణంబునం గలసిరి. ఎన్ని దినంబులకును దాను బంపిన గుఱ్ఱపురౌతులు రాకుండుటకుం జింతించి కారణ మూహింపంజాలక 'ఎటకుం జనిరో, పుత్త్రుని గాంచిరో, లేదో! ఏమైరో తెలియరాదయ్యె' అని దిగులుం జెంది గౌతముని బాల్యస్నేహితుండగు ఉద యనుం బిల్చి "నీ వరిగి నేఁటి కేడేండ్లయ్యె. ప్రాణావశేషంబుగా శరీరధారినై యుంటిని. ఇఁక నిల్వంజాలను. జనకున కపార దుఃఖంబు గల్పించు సుతునికంటె దుష్టులెవ్వరు గలరు? ఒక పరి వచ్చి నన్జూడకుండిన నే నొప్పను. ఈ నగరంబులో నాబాల గోపాలంబుం దనరాక కెదురు చూచుచున్నారని వచించి నీహితుని దోడ్కొనిరమ్ము" అని యుదయనుని బంపెను. అతండును వేగంబ రాజగృహపట్టణంబునకు నరిగి బుద్ధుని

గాంచి యతని సమీపంబునకుం బోయి తాఁ గొనివచ్చిన వార్తం దెలియంబల్కెను. బుద్ధుండును దనయనుంగు నెచ్చెలి గాంచి నమస్కరించి 'మిత్రమా! నా తండ్రియు, సతియు నన్నుం జూడవలయు నను గోర్కె యతిశయించఁగ నిన్ను బంపిరి కదా! ఇఁక నాలస్యము చేయంజనదు. వారలకడకుం బోవుట యుచితంబు. దేహంబు లేక ముక్తింగాంచ నేరి శక్యము? అట్టి దేహోత్పత్తికి మూలంబు తల్లిదండ్రులు. అట్టి జననీజనకులకు చేతోమోదంబు గల్పించుట ముఖ్య ధర్మము. ఇయ్యది నీతిమార్గము. నాకే కాదు' సర్వుల కవ లంబనీయ మైన సన్మార్గం బిది. ధర్మమార్గానువర్తులై పూర్వ కర్మానుసరణం బగు శుభాశుభఫలంబుల నిర్మలమనంబుతో ననుభవించుచు విశేష భూతదయ కలిగి సకల జీవమ్ములకు సంతుష్టి కలుగంజేయు మహాత్ములకు నిర్వాణపదంబు నిరా టంకముగ లభించు. నీవు ముందరగం బొమ్ము. నేను నతిప్ర మదంబున నీవెన్కనే వచ్చుచున్న వాఁడను' అని చెప్పి యతనిం బంప నతండును గపిలవస్తు నగరంబునకుంజని యథా క్రమంబుగ వృత్తాంతంబంతయు విస్తరించఁగ నా పట్టణ వాస్తవ్యులందఱును అమందానంద కందళిత హృదయార విందులై నగరం బలంకరింపం దొడంగిరి. నానావిధ చిత్ర విచిత్రమ్ములుగం దోరణంబులు కట్టియు, రంగవల్లులు తీర్చియు వితానంబులు గట్టించియు రాసుతునిరాక కెదురుచూచుచుం

గొందఱు గోపురంబులు కొందఱు మిద్దెలు, కొందఱు రంగులు నెక్కిరి. కొందఱు ద్వారంబుల నిలువంబడిరి. నగరంబంతయు నల్ల కల్లోలంబై యుండెను. అట్టి సమయంబున నొక్క సన్న్యాసి మృణ్మయ కమండలువు కరంబునఁ బూని కాషాయాంబరధరుండై బిచ్చమునకు నిల్లిల్లుఁ జనుచు భిక్షమిడిన వారిని, ఇడనివారి నొక్క విధంబుగ సత్కరింపుచు నమస్కరింపుచు వచ్చుచుండెను. అతని వెంట మఱియిద్దఱు సన్న్యాసులును వచ్చిరి. మొదట వచ్చుచుండిన సన్న్యాసియొక్క మోహనత్వము, గాంభీర్యము, సౌష్ఠవంబు, మనోహరత్వము, మహానుభావత్వమును సూచించుచుండెను. అతని దర్శనంబు ద్రష్టలకుఁ దన్మయత్వమును కలుగఁజేయుచుండెను. అతనిం గన్నులఁ గాంచినతోడనే శిష్యత్వము వహింపఁ గుతూహలము చూపఱులకెల్ల జనించుచుండెను. అందఱును భయము భక్తి, విశ్వాసము కలిగినవారలై అతనికి నమస్కృతు లొనరించి సపర్య సలుపు భావంబుతో నితని వెంటనేని నేగినఁ గొంత పుణ్యమబ్బు ననుకొనుచుండిరి. కాని యతండు సర్వార్థసిద్ధుండని యొక్కఁడేని గుర్తింపఁజాలఁడయ్యె. ఇవ్విధంబుగ నామహనీయుండు రాజకవాటంబు జేరుతఱి నక్కడ జడలుగట్టిన తలతోను, కృశించిన గాత్రంబుతోను, తేజోహీనంబైన మొగంబుతోను, దైన్య దుఃఖ సంతోషంబులం జెందిన యశోధరాదేవి బుద్ధునిం గాంచి గుర్తించి 'హా!

నాథా!' యని కన్నుల నీరు కాల్వలై ప్రవహింప బుద్ధుని పాదములపైఁ బడెను. అతండును సగౌరవంబుగ నక్కాంతను లేవనెత్తఁగ నామె వివశ మనస్కయై భర్తను గాఁగిలించుకొనియెను. అందువలనను, ముఖముయొక్క పోలికను బట్టియుఁ దనసతిగా గుర్తించి అను నయంపు పల్కుల నామె నోదార్చి ఆమె మనంబు కలఁకదేర్చి, మృదుమధుర గంభీర సంభాషణమ్ముల బోధామృతంబు చవిఁజూపించె. జనులందఱును గుంపుగూడి 'ఇతండే సిద్ధార్థుండు. మనము గుర్తింపలేకపోతిమి. ఎంత మారిపోయినను గుర్తులు కనంబడుచున్నవి. ఎంత మోసపోయితిమి!' అని యాశ్చర్య మొందుచుండు సమయంబున శుద్ధోదనుండు నక్కడకు విచ్చేయ, బుద్ధుండు తన తండ్రికి భక్తి, ప్రేమలను సూచింపుచుఁ బ్రణామంబొనర్చెను. శుద్ధోదనుని మనంబు ఆ ప్రణామంబుతో నిర్మలంబయ్యె. మహానుభావుల మహిమ లద్భుతావహంబులుకదా? బుద్ధుండైన సర్వార్థసిద్ధుండు శుద్ధోదనునికిఁ దన పూర్వవృత్తాంతంబు లన్నింటిని దెలియంజెప్పి తనకును యశోధరకును గలుగు సంబంధంబు పరంపరగా ననేక జన్మంబుల నెడతెగకుండ సంభవించుచున్నదని వచించి తన కీజన్మంబునఁ బునరావృత్తి రహితంబైన శాశ్వత నిర్వాణపదవి యబ్బెననియు లోకంబుననుండు అజ్ఞానులకెల్ల విజ్ఞానం బుపదేశింప జన్మించితి ననియు నుడువుచు జనకుని హస్తంబుఁ బట్టికొని యశోధరా, రాహుల

సమేతుఁడై జనసంకులమ్ములగు రాజపథమ్ములఁ దిరుగుచు బోధ సుధారసమును బ్రసరింపఁజేసి వారలకు జ్ఞానబోధ గావించెను. తత్త్వమార్గం బుపదేశింప శుద్ధోదనుండును, యశోధరాదేవియు నధిక చిత్తశాంతి కలిగినవారలై బుద్ధుని మతం బవలంబించిరి. 'విజ్ఞానాధికారంబుగల మనుజుల కందఱకు భిక్షువేషం బాపాదించి తక్కినపౌరుల కధిపతిగా రాహులునకు శాక్యరాజ్యపట్టాభిషేకం బొనర్చి యచ్చోటుఁ గదలి యనేకాంతేవాసిజన పరివృతుండై' సతీపితృ సమేతంబుగ కోహానానదీతీరంబుననుండు నొక్కవనంబునకు బుద్ధుం డేగెను. సాగరమ్మను నగర నికటమ్మున నొక మహావనమ్ముకలదు. అయ్యది శీతనగప్రాంతమ్మున నుండు. అక్కడికి కోహానానది చేరువగా నుండు. అందువలన నావనంబున మిక్కిలి చల్లని గాలి వీచుచుండును. ఫలపుష్ప పల్లవభర నమ్రవృక్షంబు లతివిశేషంబుగ నందుండుటచే నావనంబు మనోజ్ఞమై తనరి యుండు. బుద్ధుం డీవనంబు జేరి యొకనాఁడు ఆనంద, దేవదత్త ప్రభృతు లగు శాక్యనరపాలకులు వెనుకను శుద్ధోదనుండు వామపార్శ్వంబునను యశోధర పాదముల కడను నానాదేశాగతాంతేవాసి జనంబులు ముందఱను జెలంగఁ దన మతంబు వివరింపఁ దొడంగెను. దేవతలును బుద్ధుని యుపన్యాసము వినఁ గుతూహలులై మింటన్నిలిచిరి. బుద్ధుండు జ్ఞానోపన్యాసము స్వకీయమైన భాషయం దొనర్చినను వినువారి

వీనుల కదేమి చిత్రమో! వారివారి స్వకీయభాషలలో సంభాషించినటులు వినంబడుచుండెను. మహాత్ములకసాధ్యములుండ నేరవుగదా? శబ్దచాతుర్యము, వాగ్ధాటి, మోహనత్వము, పటుత్వము, మాధుర్యము, గాంభీర్యము, మనోహరత్వము, మృదుత్వము అతని యుపన్యాసంబునఁ బ్రధానంబులై తనర శ్రోతలకును ద్రష్టలకును నయ్యది బోధామృత ప్రవాహంబు పగిది రాజిల్లెను. మహానుభావుండును, అవతారపురుషుండును అగు బుద్ధుని యుపన్యాసంబు గ్రంథవిస్తరభీతిచే వివరింపఁ దొడంగక కొన్నియంశంబుల నీ క్రిందఁ బొందుపఱచితిమి.

అమేయంబైన పదార్థమును వివరింప వలనుపడదు. అట్టిపదార్థంబు జ్ఞానోదయంబున గోచరంబగు. జననమరణమ్ములు సుఖదుఃఖంబులు ఎడతెగక సంభవించుచుండు. సముద్రంబునందలి సలిలంబు బాష్పరూపంబై మేఘాకారంబుగ వర్షించి భూమిపైఁబడి నదులం జేరి తన్మూలంబుగ నబ్ధిం జేరు భంగి పుట్టుట గిట్టుటలకు విశ్రాంతి లేదు. భూమండలంబు సతతంబు పరిభ్రమించు పగిది జన్మమ్ములును భ్రమణం బొందుచుండు. ప్రారబ్ధానుసారంబుగ సంభవించు శుభాశుభంబు లనుభవనీయంబులు. ఉపవాసంబులు, జపంబులు, హోమంబులు, ప్రార్థనలు వృథాదేహ పరిశ్రమంబులు. ఇవి ప్రారబ్ధంబును మాన్పఁజాలవు. కర్మవలన జన్మపరంపర కలుగుఁ గావున మనుజులందఱును సత్కర్మలనొనరింపవలయు.

నీచత్వము, ఘనత్వము మనమొనరించిన కర్మవలననే సంభవించుచున్నవి. ఇట్టికర్మ మనివార్యం బైనను సంకల్పశక్తికి లోఁబడును. సంకల్పంబు బలవత్తరంబు. సత్సంకల్పముల వలన నుత్తమజన్మంబులు సంప్రాప్తములగును. అట్టి యుత్తమ జన్మంబులు కొన్ని గతించుచు, దివ్యజ్ఞానంబును, దివ్యదృష్టియు నుదయించు. దానం జేసి నిర్వాణపదంబు కరతలామలకం బగు!

ఆద్యంతములు లేక సర్వదా దేదీప్యమానంబైన యొక్క విమలాత్మయగు శక్తికలదు. అయ్యది యెల్ల వస్తువులందును దత్తదనుగుణంబులగు గుణంబులను సంఘటించుచు, సర్వత్ర వ్యాపించుచు, సర్వులకు సన్మార్గమును సర్వదా సూచించుచు నుచ్చస్థితికిఁ దెచ్చుచుండు. ఇదియ ప్రపంచ స్థితికిఁ గారణంబు. ఇయ్యది నిజంబుగ రూపరహితంబు. దీని విశేషంబు లనంతమ్ములు.

ఈ శక్తి సర్వ సాక్షిణి. ఇది యెల్లర కర్మములందును న్యూనతా న్యూనతలం గ్రహించి త్రాసునఁదూఁచినట్టు లెవ్వరికేవి భోగ్యమో క్రమంబుగ నది వారికొసఁగుచుండును. ఈ శక్తికి శుద్ధ ప్రేమంబు స్వరూపంబు. ఇది సతతము న్యాయమార్గంబు నవలంబించుచుండు.

జన్మంబులందు మనుష్యజన్మంబ యుత్కృష్టంబు. మనుష్యజన్మ మెత్తినవాని నిర్వాణ సౌధంబునకుఁగల సోపానంబు లెక్కువానిఁగా నెఱుఁగవలయు. ఈ భవమ్మున భూతదయ

యావశ్యకంబు; దీని నెవ్వరును దిరస్కరింపఁ దగదు. అట్లు పరిభవించినవారలు మరల నధమ జన్మంబులం బడుదురు.

సన్మార్గంబు మనశ్శాంతిని సౌఖ్యమును గలిగించు. ద్రోహంబు, దుష్టత్వంబు, నానా బాధలం గల్పించుచుండు. జీవహింసమాని భూతదయగలిగి న్యాయమార్గంబున వర్తించు వారలకు శాంతియు నిర్వాణంబును లభించు. కలుపుఁదీసి పారవైచిన పంట బాగుగ ఫలించు విధంబున బాపకృతు లెడపువారలకుఁ బుణ్యగతి లభించుచుండు; తా నొనరించిన కర్మఫలంబును నిరాయాసంబుగ ననుభవించుచు, సత్యము, అనవద్యత, దయ, పరోపకారము, సహానుభవము, గలిగి వాంఛాలతను మొదలంట నున్మూలముగావించిన ధన్యతమునికి జన్మ రాహిత్యంబును, నిర్వాణంబును సంప్రాప్తమగును. 'పుణ్యకర్మంబు మిగిలిన నయ్యది జన్మాంతరమున ననుభవింపక జన్మరాహిత్యం బెట్లువడయునని శంకింపవలవదు. ఏజన్మంబునఁ దనచేసిన దంతయు సుకృతకర్మంబగునో దానికిఫలంబు నిర్వాణ పదంబ కాని జన్మాంతరంబు గాదు. ఇది కర్మసిద్ధాంతంబు.'

పట్టుపురుగు దాఁబెట్టు పట్టులోఁ దగులుకొనెడు కరణి జీవుండును దా నొనర్చు కర్మజాలమున కట్టఁబడుచుండు. కర్మఫలం బెట్టివారి నైననుఁ బట్టి అనుభవింపం జేయు. సద్వర్తనుల కుత్తమజన్మలును దుష్ప్రవర్తనులకు నీచజన్మంబులును గలుగుచుండు. నీచులు సత్కర్మాచరణమునందు

మనంబు తగులక అజ్ఞానంబు అధికంబై ప్రపంచసుఖముల అనిత్యత్వము దలపక వనితా విత్త మూలంబగు కామ క్రోధాదులకుం జిక్కి స్రుక్కుచుందురు.

జీవనంబు కష్టభాజనంబు. ఇదియ ప్రథమతత్త్వంబు. సర్వదుఃఖంబులకును దృష్ణయె ప్రధానకారణంబు. తృష్ణావశ్యత్వంబు నింద్రియనిగ్రహంబు ద్వితీయతత్త్వంబు. శాంతి, చిత్తశుద్ధి, భూతదయ, మృదుభాషణంబు, దీనివలన జన్మరాహిత్యంబు గలుగు. ఇది తృతీయతత్త్వంబు. నిర్వాణమార్గంబు నాల్గవతత్త్వంబు. ఇది యెల్లరకు సులభంబు కాదు. నిర్దయ, దురాశ, కోపము వర్జనీయములు. వీని నడచి భూతదయ కలిగి సత్ సంకల్పులుగ నుండవలయు. మౌనమే సర్వత్ర అవలంబనీయము. ఎప్పుడైనఁ బలుకవలసివచ్చిన శాంతముగా భాషింపవలయు. ఇవి నాలుగు సోపానంబులు. పారిశుధ్యము, సచ్చింత, ఏకాతత్త్వము, సందానందంబు అను నాలుగును పైనుండు సోపానంబులు. మనో నిర్మలత్వంబు, విషయ నివర్తనంబును దత్త్వసిద్ధికిం బ్రధానంబులు.

అసూయ, అహంకృతి, అజ్ఞానము, వీనిని జయింపవలయును. ఇవి యాపైనుండు మూఁడుమెట్లు. పిమ్మట జీవితేచ్ఛ, స్వర్గవాంఛ, ఆత్మస్మృతి, పొరపాటు, గర్వము వీనిని గ్రమముగ విడనాడవలయును. ఈస్థితి బొందినవాఁడు కర్మాతీతుఁడు. ఆనందమయమగు నిర్వాణము నిట్టిదని రచింపఁగ

రాదు. జ్ఞానమార్గం బవలంబించిన నది తనయంత గోచరంబగును. ఈ జ్ఞానమార్గంబునకు ఏప్రాణినైన హింసింపకుండుట, మోసముచేయకుండుట, పరనిందా నృతంబులు వలుకకుండుట, గంజాయి, మద్యాదుల వర్జించుట, పరదారగమనాది దురితమ్ములు సలుపకుండుటయు నైదుసూత్రంబులు.

ఇట్టి విషయంబు లనేకములు బుద్ధుం డుపదేశించి యనేకులను భిక్షువేషధారులనుగా నొనరించి వారలకు విజ్ఞానం బమరఁజేసి నానాదిగంతదేశంబులకుఁ దన మతవ్యాపకత్వమునకు వారిఁ బంపెను. బుద్ధుండీవిధంబుగ దేశమంతయు సంచార మొనరించి హితంబగు తన మతంబును సర్వజనులకు జాతి వివక్షత లేక, వర్ణభేదంబు పాటింపక, ఉపదేశించి వారలను దరింపఁజేయుచుండెను. ఈ ప్రకారంబు దాదాఁపు నలువదియైదు సంవత్సరంబులు పాటుపడి లోకోపకారమునకై తన శరీరము నర్పించి బుద్ధుండు కలియుగంబున 2558-వ సంవత్సరంబున శరీరమును వదలి జన్మరాహిత్యమైన శాశ్వత నిర్వాణపదవి నధిష్ఠించెను.

"ఓ భిక్షులారా! ప్రపంచమందు సర్వము అనిత్యము, అధ్రువము, అశాశ్వతము. కాఁబట్టి శాశ్వతమైన నిర్వాణమును జెందఁ బ్రయత్నింపం దగు" అని శరీర విసర్జనమునకుం బూర్వము దయామయుండగు బుద్ధదేవుం డుపదేశించెను.

బుద్ధదేవుని పవిత్రశరీరము మంచి గంధపుకొయ్యతోఁ జేయఁబడిన ముక్కాలు పీటమీఁదనుంచి, మహాకశ్యపుఁడును, 500 మంది భిక్షులును మూఁడు పర్యాయములు ప్రదక్షిణంబు లొనర్చి బుద్ధుని పాదారవిందములఁ బూజించి నమస్కరించి గురుశరీరమునకు దహన సంస్కారములఁ గావించిరి. దహనమైన పిదప భిక్షులు లోహపాత్రములలో నస్తిసంచయన మొనరించి ఆపాత్రముల నతి సంరంభముతోఁ బట్టణమునకుఁ గొనిపోయి అక్కడొక్క వారముంచిరి. కట్టకడపట బుద్ధుని అస్తులు రాజగృహ నగరమందును వైశాలియందును, కపిలవస్తు పురంబునను, అల్కాపురంబునను, రామగ్రామమందును, ఉల్లద్వీపమందును, కుశినగరమందును భూస్థాపితములుగా నొనరింపఁబడి వానిపై గొప్పసమాధులు కట్టఁబడెను. ఈ ప్రదేశములు బౌద్ధుల కందఱకు యాత్రా యోగ్యములు.

బౌద్ధమత ప్రభావంబు ప్రపంచమందంతటను క్రమక్రమముగా ప్రసరించి మానవుల మనోభావములను సంస్కరించెను. బుద్ధునికి బ్రథమధర్మంబైన భూతదయ మానవులందఱవలంబించి జితేంద్రియులై బుద్ధునివలె లోకోపకారం బొనరించి కృతార్థతం జెందుదురు గాక. సర్వసంస్కార సాఫల్యమునకుఁ బ్రధానంబు లగు మనోనిగ్రహంబు, నిరహంకారంబు, స్వార్థపరిత్యాగంబు సర్వజను లభ్యసించి వైరాగ్యసంపత్తిం జెంది మాతృదేశమునకుఁ బూర్వపు ఔన్నత్యమును గలిగించ నుద్యుక్తు లగుదురు గాక.

END OF
TITLE